బుధవారం
11-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 200
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

## దివాలా దశకు పాకిస్తాన్!

పాకిస్తాన్ దివాలా దశకు చేరుకున్న సూచనలు ఉన్నాయి. ఆ దేశంలో తీవ్రమైనా ఆర్థిక సంక్షోభం నెలకొన్నది. పర్యవసానంగా ఆహార కొరత ఏర్పడి రేషన్ అందక జనం అల్లాడిపోతున్నారు.

2లో

# జీఓ 1పై కోర్టుకు

**ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి రద్దు చేయాలి: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**

**విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల :** రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా జీవో నంబరు-1 జారీ చేసి రావణకాష్టం రగిల్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బాపట్ల పట్టణంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్మిక, విద్యార్థి సంఘాలు ముక్త కంఠంతో జీవోను వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇది అత్యంత దుష్ట జీవో అని అన్నారు. నాడు బ్రిటీష్ పాలకులు ఈ చట్టాన్ని తీసుకువచ్చి అణచివేయాలని చూశారన్నారు. అదే బాటలో రాష్ట్ర ప్రభుత్వం

- మిగతా 2 లో

# ఉపేక్షించరాదు...

**మారుమ్రోగిన 'నో ఆమ్నెస్టీ' నినాదం**

- విధ్వంసకారులను జైళ్లకు పంపాలని డిమాండ్
- రియో డి జనేరియో, సావోపాలో వీధుల్లోకి వేలాది మంది
- బ్రెజిల్‌లో ప్రభుత్వ అనుకూల ర్యాలీ

**రియో డి జనేరియో/బ్రెసిలియా:** బ్రెజిల్‌లో బోల్సనారో మద్దతుదారులు సృష్టించిన అలర్లను స్థానికులు వ్యతిరేకించారు. అల్లర్ల సృష్టికర్తలను, విధ్వంసకారులను అరెస్టు చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, ప్రజాస్వామ్యానికి మద్దతిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. 'నో ఆమ్నెస్టీ.. జైల్ ఫర్ కూప్ ప్లాటర్స్' (క్షమించొద్దు... అల్లర్ల కుట్రదారులను జైళ్లకు పంపాలి), 'ప్రజల తీర్పును గౌరవించాలి', మాది ప్రజాస్వామ్యం' అంటూ నినదించారు. వేలాది మంది రోడ్లపైకొచ్చి లూలా ప్రభుత్వానికి, ప్రజాస్వామ్యానికి మద్దతిస్తూ బోల్సనారో ప్రోద్బలంతో జరిగిన అల్లర్లను ఖండించారు. అలర్లకు కారణమైన వారెవ్వరినీ వదిలిపెట్టరాదని, వారందరిని జైళ్లకు పంపాలని డిమాండ్ చేశారు. రియో డి జనేరియో, సావోపాలో జరిగిన ర్యాలీలో 'నో ఆమ్నెస్టీ' (క్షమించరాదు) నినాదాలు మారుమ్రోగాయి. నినాదాలు, భారీ బ్యానర్లు, పోస్టర్లతో తమ వ్యతిరేకను లూలా అనుకూల వర్గం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు పిలుపునిచ్చింది. 'అల్లర్లను రెచ్చగొట్టినవారిని, డబ్బులిచ్చిన వారిని ఉపేక్షించరాదు. ప్రజాస్వామ్యం వ్యతిరేకులు బ్రెజిల్‌కు చెందిన వారు కాబోదు... ప్రజాస్వామ్యం కోరే మేమే బ్రెజిల్ ప్రతినిధులం' అని నిరసనకారుల్లో ఒకరైన 61ఏళ్ల బెట్టీ అమీన్ అన్నారు. గత అనుభవాలు నేర్పిన పాఠాలను మరువరాదని, విద్రోహ శక్తులపై ఉదారత వద్దని ప్రభుత్వానికి మద్దతుదారులు సూచించారు. తాజా పరిణామాలతో తాము రోడ్లపైకి రాక తప్పలేదని, ప్రతిస్పందన అనివార్యమైందని అన్నారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించాలంటూ ప్రజాస్వామ్యం మద్దతుదారులు నినాదాలు చేశారు. తాజా పరిణామాలపై న్యాయమంత్రి ఫ్లావియో డీనో స్పందిస్తూ ఉదారంగా వ్యవహరించేది లేదని, అల్లర్ల సృష్టికర్తలకు శిక్షలు తప్పబోవని అన్నారు.

**దోషుల్ని వదలం: లూలా**

మాజీ అధ్యక్షుడు బోల్సనారో మద్దతుదారులు సృష్టించిన విధ్వంసాన్ని ఆ దేశాధ్యక్షుడు లూలా డ సిల్వా తీవ్రంగా ఖండించారు. దోషులను వదలబోమని ఆయన తేల్చిచెప్పారు. బ్రెజిల్‌లో జరిగిన అల్లర్లు తమ దేశాన్నే కాకుండా మొత్తం ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసిందని, అంతర్జాతీయ సమాజం సంఘీభావానికి కృతజ్ఞులమని బ్రెజిల్ విదేశాంగ శాఖ తాజా ప్రకటన పేర్కొంది. అన్ని దేశాలు, అంతర్జాతీయ సంఘాలు ఈ విధ్వంసకాండను, ఉగ్రవాదాన్ని ముక్కకంఠంతో ఖండించాయని తెలిపింది. 1988 నాటి పరిస్థితులను తాజా పరిణామాలు గుర్తుచేసినట్లు వెల్లడించింది. వీటిని ఎలా ఎదుర్కోవాలో బ్రెజిల్ ప్రభుత్వానికి బాగా తెలుసన్నది. అమెరికా, చైనా, రష్యా, భారత్ సహా అనేక దేశాలు అల్లర్లను ఖండించారు. బ్రెజిల్ ప్రభుత్వానికి మద్దతు తెలిపాయి. ఐరాస జనరల్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ కూడా తమ మద్దతు ప్రకటించారు. బోల్సనారో మద్దతుదారుల దాడుల్లో జరిగిన నష్టాన్ని అధ్యక్షుడు లూలా సమీక్షించారు. దాడి ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. అధ్యక్ష భవనం, సుప్రీంకోర్టు, నేషనల్ కాంగ్రెస్ కార్యాలయాల్లో జరిగిన నష్టాన్ని పరిశీలించారు. మరోవైపు ఆయన పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి వ్యతిరేక కార్యకలాపాలను

- మిగతా 2 లో

## చలితో గజగజ

- రాష్ట్రంలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఏజెన్సీని కప్పేసిన పొగమంచు

రాష్ట్రాన్ని చలిగాలులు వణికిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎప్పుడూ వెచ్చగా ఉండే కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ చలి అధికంగా ఉంది.

2లో

## పోలీసులే ఫిర్యాదుదారులా?

**టీడీపీ అధినేత చంద్రబాబు ఫైర్**

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాష్ట్రంలో పోలీసులే ఫిర్యాదుదారులుగా టీడీపీ క్యాడర్‌పై అక్రమ కేసులు పెట్టడాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. కుప్పం, పుంగనూరు ఘటనల్లో పార్టీ కార్యకర్తలపై హత్యాయత్నం కేసులు పెట్టడాన్ని ప్రస్తావిస్తూ వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. రజనీకాంత్ నటించిన సినిమాలో గంగ చంద్రముఖిగా మారినట్లు...రాష్ట్రంలో కొందరు పోలీసులు పూర్తి స్థాయి వైసీపీ కార్యకర్తలుగా రూపాంతరం చెందిన క్రమం ఇదని ఎద్దేవా చేశారు. మొదట్లో టీడీపీపై వైసీపీ అక్రమ కేసులకు అండగా కొందరు పోలీసులు నిలిచారనీ, ఇక ఇప్పుడు తప్పుడు కేసులు పెట్టే బాధ్యత కూడా వాళ్లే తీసుకోవాలన్నారు.

# టీచర్లపై సంక్రాంతి భారం

- బడిఈడు పిల్లలు, యూడైస్ సర్వేకు ఒత్తిడి
- పండగలోగా వివరాలివ్వాలని ఆదేశం
- జగన్ సర్కారు వైఖరిపై ఆగ్రహం
- ఉపాధ్యాయ, ఉద్యోగుల ప్రయోజనాలపై నిర్లక్ష్యం

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ప్రభుత్వ ఉపాధ్యాయులను జగన్ ప్రభుత్వం నిత్యం పని ఒత్తిడికి గురిచేస్తోంది. సంక్రాంతి సెలవుల్లోనూ వారిపై సర్వేల భారం, ఇతరత్రా బాధ్యతలు అప్పగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 12వ తేదీ నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. సెలవులతో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు ముందస్తు రిజర్వేషన్లు చేయించుకున్నారు. ఈ సెలవుల్లోనూ బడిఈడు పిల్లల పరిస్థితిపై (హేబిటేషన్), యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ లెవెల్ ఆఫ్ స్కూల్స్ (యూడైస్) సర్వే వివరాలను ఆదేశించడంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అసలే నిత్యం వివిధ యాప్‌ల సమాచారం పొందుపరచడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పనుల్లో ఉపాధ్యాయులు ఒత్తిడితో తల్లడిల్లుతున్నారు. అటు సంక్షేమ పథకాల పనుల బాధ్యతలు, ఇటు బోధనా పరమైన అంశాలతో వారిపై పని భారం పెరుగుతోంది. నాడు-నేడు పనుల బాధ్యతల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం భాగస్వామ్యం చేసింది. అమ్మఒడి పథకం జాబితా వివరాలను నిత్యం ఉపాధ్యాయులు యాప్‌లలో అప్‌లోడ్ చేయడం, నూతనంగా పథకంలోకి వచ్చే వారి జాబితాలను రూపొందించడం తదితర పనులతో సతమతమవుతున్నారు. పాఠశాల విధులు నిర్వహించిన తర్వాత కూడా, ఇంటి వద్దకు వచ్చాక, సెలవుల్లోనూ ఉపాధ్యాయులు బోధనేతర పనుల్లో నిమగ్నమవుతున్నారు. తాజాగా సంక్రాంతికి కూడా ఈ సర్వే చేపట్టి, సంక్రాంతి సెలవుల్లోనే వివరాలు అందజేయాలంటూ పాఠశాల విద్యాశాఖ ఆదేశించడం తగదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇన్ని రోజులపాటు ఈ సర్వేపై ప్రభుత్వం మౌనంగా ఉండి, కేవలం సంక్రాంతి పండుగ సెలవుల్లోనే సర్వే వివరాలకు ఆదేశించి, తమ ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారంటూ వాపోతున్నారు.

**ఉపాధ్యాయుల ప్రయోజనాలపై నిర్లక్ష్యం**

ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన వివిధ ప్రయోజనాలపై జగన్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానంపై మూడున్నరేళ్ల నుంచి నాన్చుడు

- మిగతా 2 లో

# కూలీలపై కుట్ర

**'ఉపాధి పథకం' పనుల్లో మాన్యువల్ హాజరుకు చెల్లు**

- కఠిన నిబంధనలు తీసుకొచ్చిన కేంద్రం
- ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు
- రెండు పూటలా తీసుకోవాల్సిందే
- పనులు చేసే ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు
- కష్టం దక్కదేమోనన్న ఆందోళనలో కూలీలు

**విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు కూలీలకు పొట్టకొట్టేలా ఉన్నాయి. ఈ నిబంధనల ప్రకారం ఓ యాప్ ద్వారా రోజుకు రెండుసార్లు హాజరు నమోదుకు సిగ్నల్ అడ్డుపడే పరిస్థితి కనిపిస్తోంది. మారుమూల ప్రాంతాల్లో ఉపాధి పనులు జరిగే మరో కొన్ని ప్రాంతాల్లో ఈ పరిస్థితి తలెత్తనుంది. ఉపాధి హామీ పథకం పనుల అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం కూలీల హాజరు నమోదులో కఠిన నిబంధనలు తీసుకువచ్చింది. ఈ సంవత్సరం నుంచి అమలులోకి వస్తాయని స్పష్టం చేసింది. ఇక నుంచి ఈ పథకంలో చేపట్టే అన్ని రకాల పనులు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇకపై కూలీలు పనిచేస్తే మాన్యువల్ హాజరుకు చెల్లు చీటీ పడినట్లే. ఎక్కడైతే కూలీలు పని చేస్తారో అక్కడ లైవ్ లొకేషన్ ఆన్ చేసి మొబైల్ యాప్ ద్వారా జియో ట్యాగింగ్ చేసి హాజరు నమోదు చేయవలసి ఉంటుంది. ఈ యాప్ ద్వారా అన్ని రకాల పనులు నమోదు చేస్తేనే కూలీలకు వేతనం లభిస్తుంది. ఈ ప్రాజెక్టు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, ఇంకుడు గుంతలు,

- మిగతా 2 లో

**ఎనిమిది గంటలు పని చేయాలి**

ఉపాధి కూలీలు 8 గంటలు తప్పనిసరిగా పనిచేయాలని, ఉదయం 4 గంటలు, మధ్యాహ్నం 4 గంటలు పని చేయాలన్నారు. ఈ ఉత్తర్వులు గతంలోనే ఉన్నాయని, సిగ్నల్, సాంకేతిక సమస్యలు ఉన్న ఏజెన్సీ ప్రాంతాలలో ఆఫ లైన్‌లో నమోదు చేసి పంపితే సరిపోతుందన్నారు. జిల్లాలో 3 లక్షల 20 వేల జాబు కార్డులు జారీ చేశామని తెలిపారు. కోటీ 17 లక్షల 45 వేల పని దినాలు పూర్తిచేసి రూ.240.06 కోట్లు అందజేశామని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు నెలల్లో 25 లక్షల పని దినాలు కల్పించడం ద్వారా రూ.60 కోట్లు వేతనాల రూపంలో ఇవ్వాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించామన్నారు.

డి.రాంబాబు, డ్వామా పీడీ

## ఇదీ లోకం!

మేము ' చీకటి జీవో ' తెచ్చామనడం అబద్ధం పట్టపగలు తెగించి మరీ తెచ్చాం!

# రైల్వేలో 3.12 లక్షల ఖాళీలు

- తీవ్రమైన సిబ్బంది కొరత
- రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు
- రైల్వే-ట్రాక్ నిర్వహణలో లోపాలు
- ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు
- పెరుగుతున్న నిరుద్యోగంతో మోదీ అభివృద్ధి ప్రచారంలో డొల్లతనం బట్టబయలు

**న్యూఢిల్లీ:** దేశంలో మోదీ పాలన నిరుద్యోగానికి కేరాఫ్‌గా మారింది. ఎన్డీయే పాలన సాఫీగా సాగుతోందని, తమ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతోందన్న ప్రచారంలోని డొల్లతనాన్ని పెరుగుతున్న నిరుద్యోగం బట్టబయలు చేస్తున్నది. 2014లో ఎన్నికలప్పుడు అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని మోదీ హామీనిచ్చారుకానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ కల్పన మాట మర్చిపోయారు. ఉపాధి అవకాశాలు లేక నైపుణ్య-విద్యావంతులైన యువత నిరాశ నిస్పృహలకు గురవుతున్నారు. మోదీ పాలనలో వివిధ రంగాలలో ఖాళీలు భర్తీ కావడం లేదు. ఇదే క్రమంలో భారతీయ రైల్వేలో 3.12లక్షలకుపైగా నాన్-గెజిటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరత వల్ల వ్యవస్థపై ఒత్తిడి

- మిగతా 2 లో

## ధిక్కార కేసులో ఇమ్రాన్ ఖాన్‌కు అరెస్టు వారెంట్

**ఇస్లామాబాద్ :** ధిక్కార కేసులో మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌తో పాటు ఆయన పార్టీకి చెందిన ఇతర అగ్ర నేతలకు పాకిస్తాన్‌లోని అత్యున్నత ఎన్నికల సంఘం మంగళవారం బెయిలబుల్ అరెస్టు వారెంట్లు జారీ చేసింది. పాకిస్తాన్ ఎన్నికల సంఘం (ఈసీపీ), ప్రధాన ఎన్నికల కమిషనర్ సికిందర్ సుల్తాన్ రాజాపై పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) అగ్రనేతలు జారీ చేసిన ప్రకటనల ఆధారంగా ఈ కేసు నమోదయింది. నిసార్ దుర్రానీ నేతృత్వంలోని నలుగురు సభ్యుల ఈసీపీ బెంచ్ ఖాన్, ఆయన సన్నిహితులయిన ఫవాద్ చౌదరి, అసద్ ఉమర్‌పై వారెంట్లు జారీ చేసింది. తమ పట్ల పక్షపాతంతో పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ కమిషన్‌ను, రాజాను పీటీఐ నేతలు పదే పదే దూషించడంతో ఎన్నికల నిఘా సంస్థ గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరులో ధిక్కార అధికారాలను వినియోగించుకుని వారిపై నోటీసులు జారీ చేసింది. ఈసీపీ మునుపటి విచారణలో, పీటీఐ నాయకులకు తన ముందు హాజరయ్యేందుకు చివరి అవకాశాన్ని ఇచ్చింది. మంగళవారం విచారణ సందర్భంగా హాజరు నుంచి మినహాయింపు కోసం చేసిన అభ్యర్థనలను కమిషన్ తిరస్కరించింది. ఒక్కొక్కటి రూ.50 వేల విలువైన ష్యూరిటీ బాండ్లపై అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. విచారణను ధర్మాసనం జనవరి 17కి వాయిదా వేసింది. తటస్థ ఎన్నికల కమిషనర్ పాత్రను పోషించడంలో విఫలమయ్యారనే ఆరోపణతో ఇమ్రాన్ ఖాన్... ఈసీపీ ప్రధానాధికారిని రాజీనామా చేయవలసిందిగా కోరుతున్నారు. తాను చట్ట ప్రకారమే పని చేస్తున్నానని పేర్కొంటూ ప్రధానాధికారి దానిని తిరస్కరించారు.

# దివాలా దశకు పాకిస్తాన్!

**తీవ్రమైన ఆహార కొరత**

**రేషన్ కష్టాల్లో జనం**

**గోధుమ పిండి కోసం తొక్కిసలాట**

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ దివాలా దశకు చేరుకున్న సూచనలు ఉన్నాయి. ఆ దేశంలో తీవ్రమైనా ఆర్థిక సంక్షోభం నెలకొన్నది. పర్యవసానంగా ఆహార కొరత ఏర్పడి రేషన్ అందక జనం అల్లాడిపోతున్నారు. గంటల తరబడి క్యూలైన్లలో నిలుచున్నాగానీ గుప్పెడు గింజలు, గోధుమలు, పిండి దొరకని పరిస్థితి ఉన్నది. దీంతో రేషన్ దుకాణాలు / వాహనాల వద్ద తోపులాటలు, తొక్కిసలాటలు సర్వసాధారణంగా మారాయి. ఇప్పటికే విదేశీ మారక విలువ 5.8 బిలియన్ల డాలర్లకు తగ్గి, ఎనిమిదేళ్ల కనిష్టానికి చేరగా మూడు వారాల దిగుమతులకు సరిపడ ఉన్నట్లు పాకిస్తాన్ కేంద్ర బ్యాంకు పేర్కొంది. తమ దేశం దివాళా తీయబోదని పాక్ ఆర్థికమంత్రి ఇషాఖ్ దార్ చెబుతున్నారుగానీ దివాళా దశను తాజా పరిస్థితులు సూచిస్తున్నట్లు ఆర్థిక నిపుణులు అంటున్నారు. అయితే ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వ నిర్ణయాలే తాజా పరిస్థితులకు దారితీశాయని ఇషాఖ్ దార్ ఆరోపించారు. కాగా, పిండి కోసం ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా, సింధ్, బలూచిస్థాన్‌లో తొక్కిసలాట జరిగింది. రేషన్ దుకాణాల వద్ద తోపులాటలు సర్వసాధారణంగా మారాయి. పహారా నీడలో పిండి పంపిణీ జరుగుతున్నదంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. రేషన్ పంపిణీ వాహనాల వద్ద ఉద్రిక్తత నెలకొంటూ కొందరు ప్రాణాపాయ స్థితికి చేరుతున్నారు. ఇటీవల సింధ్ దుకాణంలో పిండి తక్కువగా ఉండటంతో అక్కడ తొక్కిసలాట జరిగి ఒకరు మరణించారు. తన ఆరుగురు పిల్లల ఆకలిని తీర్చాలన్న ఉద్దేశంతో శ్రమించిన ఆ తండ్రి చివరకు ప్రాణాలు కోల్పోవడం హృదయవిదారకం. ఇటువంటి ఘటనలు ఈ మధ్యకాలంలో నమోదవుతున్నాయి. కిలో పిండి ధర కొన్నిచోట్ల రూ.150కి పెరిగింది. మిల్లు యజమానులు కూడా ధరలను పెంచుతున్నారు. ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలో 20 కేజీల పిండి ధర రూ.3,100కాగా కరాచీలో కేజీ పిండి రూ.140, పేషావర్, ఇస్లామాబాద్‌లో రూ.160 వరకు పలుకుతోంది. ధరలు ఇంతలా పెరగడం ఇదే మొదటిసారి. బలూచిస్థాన్‌లో గోధుమల నిల్వలు నిండుకున్నాయని, తక్షణమే 4,00,000 బస్తాలు కావాలని అక్కడి మంత్రి వెల్లడించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రస్తుత ఆహార సంక్షోభానికి గతేడాది వరదలు కూడా కారణం. పాక్ చరిత్రలోనే దారుణమైన వరదలని ప్రపంచ వాతావరణ సంస్థ పేర్కొన్న సంగతి తెలిసిందే.

విశాలాంధ్ర ప్రపంచం

# వణికిన ఇండోనేసియా

**7.7 తీవ్రతతో భారీ భూకంపం**

**3వేల కిమీల వరకు కంపించిన భూమి**

**కూలిన అనేక ఇళ్లు-రోడ్డున పడ్డ 62వేల మంది**

**ఆస్ట్రేలియాలోనూ ప్రకంపనలు**

**జకార్తా:** ఇండోనేసియా మరోమారు భారీ భూకంపంతో వణికిపోయింది. మంగళవారం తనింబర్ ప్రాంతంలో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు యూరోపియన్ మెడిటేరియన్ సియస్మాలజీ సెంటర్ (ఈఎంఎస్‌సీ) ట్విట్టర్ ద్వారా ప్రకటించింది. తువాల్ ప్రాంతానికి 342 కిమీల దూరంలో భూకంపం సంభవించినట్లు తెలిపింది. దాదాపు రెండు వేల కిలోమీటర్ల వరకు భూమి కంపించిందని, 14 మిలియన్ల మంది భయాందోళనకు గురయ్యారని, ఆస్ట్రేలియా, తిమోర్ లెస్టే, ఇండోనేషియాలో భూకంపం నమోదైనట్లు వెల్లడించింది. భూకంపం ధాటికి రాగల రెండు రోజుల పాటు ప్రకంపనలు సంభవించే ప్రమాదమున్నట్లు హెచ్చరికలు జారీ అయ్యాయి. కాగా ఇప్పటికే భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. భూకంపం కారణంగా సియామ్లూర్‌లో 62,545 మంది నిరాశ్రయులు అయినట్లు జిన్హువా వార్తాసంస్థ పేర్కొంది. పపువా, తూర్పు నౌస టెంగ్గర రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో ప్రకంపనలు నమోదయ్యాయి. నైరుతి మలుకులోని గ్రామాల్లో భవనాలు భారీగా దెబ్బతిన్నాయి. ప్రాణ నష్టం జరగలేదని తెలుస్తోంది. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం సముద్రానికి 105 కి.మీల అడుగున భూకంపం సంభవించింది. డార్విన్ నగరం సహా ఉత్తర ఆస్ట్రేలియాలోని 1000కిపైగా మంది భూ ప్రకంపనలతో భయపడినట్టు ఆ దేశ జియోసైన్స్ విభాగం వెల్లడించింది. సునామీ వచ్చే ప్రమాదం లేదని ది జాయింట్ ఆస్ట్రేలియన్ సునామీ హెచ్చరికల కేంద్రం వెల్లడించింది. ఇండోనేసియాలో తొలుత సునామీ హెచ్చరికలు జారీ కాగా కొన్ని గంటల తర్వాత వాటిని ఉపసంహరించుకున్నారు.

## చలితో గజగజ

**అమరావతి:** రాష్ట్రాన్ని చలిగాలులు వణికిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎప్పుడూ వెచ్చగా ఉండే కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ చలి అధికంగా ఉంది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో చలి నెలకొంది. ప్రత్యేకించి రాత్రిపూట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. రాష్ట్రంలో శీతాకాలంలో సాధారణంగా 17-22 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డవుతాయి. విశాఖ ఏజెన్సీలో సగటున 8 నుంచి 15 డిగ్రీలు ఉంటుంది. కానీ ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అరకు, పాడేరు, చింతపల్లి, పెదబయలు తదితర ప్రాంతాల్లో 5 నుంచి 9 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏజెన్సీలోని గిరిజనులు ఇళ్లనుంచి బయటకు రావడానికే వణికిపోతున్నారు.

అటు రాయలసీమ జిల్లాల్లోనూ చలి తీవ్రత అధికంగానే ఉంది. ముఖ్యంగా మన్యం వాసులు చలి తీవ్రతకు గజ గజ వణుకుతున్నారు. కొన్ని ప్రాంతాలైతే ఉదయం పది గంటలైనా సరే పొగమంచు తగ్గడం లేదు. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. సోమవారం లంబసింగి, చింతపల్లి, జి.మాడుగులలో 2, హుకుంపేట 2.3, గూడెంకొత్తవీధి 2.6, అరకులోయ 3.2, పాడేరు 3.6, మినుములూరు కాఫీ బోర్డు వద్ద 6, అనంతగిరి 8.6, కొయ్యూరులో 9.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటలైనా మంచు తెరలు వీడకపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో వ్యవసాయ కూలీలు పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ చలికి చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా చోట్ల మధ్యాహ్నం 3 గంటల నుంచే చలి గాలుల ప్రభావం కనిపిస్తోంది.

**కశ్మీర్‌ను తలపిస్తున్న అరకు**

**విశాలాంధ్ర, అరకులోయ (అల్లూరి జిల్లా):** ఆంధ్రా ఊటీ అందాల అరకులోయను చలి వణికిస్తోంది. గత ఏడాది ఈ సమయంలో ఈ స్థాయిలో చలి ప్రభావం లేదని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. చింతపల్లి,పాడేరు ఉష్ణోగ్రతల కంటే అరకులోయలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం చూస్తున్నామని చెబుతున్నారు. గతంలో లంబసింగి, చింతపల్లి, ప్రాంతంలో మాత్రమే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. అయితే గత మూడు రోజులుగా అరకులోయ ప్రాంతంలో కూడా నాలుగు డిగ్రీల దిగువకు ఉష్ణోగ్రతలు నమోదవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. కాగా శరీరం గడ్డ కట్టే రీతిలో ఉన్న చలికి వృద్ధులు, చిన్నారులు తల్లడిల్లుతున్నారు. అయితే అరకులోయకు వచ్చే సందర్శకులు చలి వాతావరణాన్ని, దట్టంగా కమ్ముకున్న మంచును ఆస్వాదిస్తున్నారు. కశ్మీర్ ను తలపించే విధంగా వాహనాలపై గడ్డకట్టే మంచును తిలకిస్తూ ఆశ్చర్యపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వాహనాలపై మంచు పేరుకుపోయి కనువిందు చేస్తోంది. ఈ చలి ప్రభావం ఈ నెల 20వ తేదీ వరకు ఉంటుందని వాతావరణ నిపుణులు చెప్పుతుండడంతో స్థానికులు హడలిపోతున్నారు. కాగా ఏజెన్సీ ప్రాంతంలో సంక్రాంతి సంబరాలు ప్రారంభం కావడంతోపాటు చలి ఉధృతంగా ఉండడంతో సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకోవడానికి ఆదివాసులకు ఇబ్బందిగా పరిణమించింది. అయితే చలి ప్రభావం తగ్గినా తగ్గకపోయినా తమ సంస్కృతి సంప్రదాయాలను విస్మరించమని వాటికి అనుగుణంగానే సంక్రాంతి పండగను జరుపుకుంటామని ఆదివాసి ప్రజలు స్పష్టం చేస్తున్నారు. అలాగే పర్యాటకులు సైతం చలిని లెక్కచేయకుండా ఆహ్లాదం పొందుతూ తమ కెమెరాల్లో ప్రకృతి దృశ్యాలను బంధిస్తూ, సెల్ఫీలు దిగుతూ మధురానుబూతిని కుటుంబ సభ్యులతో పంచుకుంటున్నారు.

## కూలీలపై కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

పశువుల షెడ్ల నిర్మాణాలకు మాత్రం మినహాయిస్తున్నట్లు వెల్లడించింది. ఉపాధి హామీ పనులు పారదర్శకంగా, అవినీతికి తావు లేకుండా చేసేందుకే ఈ పథకంలో మార్పులు తీసుకొచ్చినట్లు కేంద్రం స్పష్టం చేసింది.

**ఈ నెల నుంచే అమలు**

ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు గతంలో తీసుకుంటున్నట్లు మాన్యువల్ హాజరు ప్రక్రియను రద్దు చేసి నూతనంగా తీసుకువచ్చిన ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయవలసి ఉంటుంది. తప్పనిసరిగా రోజుకు రెండుసార్లు హాజరు తీసుకోవాలన్న కఠిన నిబంధనలను కేంద్రం అమలులోకి తీసుకువచ్చింది. గత సంవత్సరం ఏప్రిల్, మే నెలలో కొన్నిచోట్ల ఈ యాప్ ద్వారా లైవ్ లొకేషన్ ఆన్ చేసి కూలీల ఫొటో, హాజరైన వారి పేర్లను అప్‌లోడ్ చేసేవారు. 20 మంది సభ్యులు ఉండేలా పంపించేవారు. ఈ కొత్త యాప్‌లో 100 మంది కూలీలు హాజరు నమోదయ్యేలా ఏర్పాటు చేశారు. ఈ విధానం ద్వారా పంపించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఆన్‌లైన్ హాజరు నమోదు సాధ్యమేనా?**

ఉపాధి హామీ పనులు గ్రామ శివార్లలో గట్టులు, కాలువలు, చెరువుల ప్రాంతాలలో చేపడతారు. అయితే ఈ యాప్ ఆన్‌లైన్ చేయాలంటే అనేక రకాల సమస్యలు తలెత్తుతాయి. సిగ్నల్ సమస్య ఎక్కువగా ఉంటుంది. దేశమంతా ఈ యాప్ వినియోగిస్తున్నందున సర్వర్ డౌన్ కావడం, అందరికీ స్మార్ట్ ఫోన్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. ముఖ్యంగా ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన బుట్టాయిగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం తదితర మండలాలలో సిగ్నల్స్ సరిగా అందవు. గిరిజనులు, ఏజెన్సీ ప్రాంతంలో కూలీలకు పనులకు వెళతామన్నా స్మార్ట్ ఫోన్ కలిగిన వాళ్లు లేనందున పనులకు దూరం అయ్యే అవకాశం ఉంటుంది. ప్రతి 100 మందికి ఒకరిని నియమించాలి. స్మార్ట్ ఫోన్ వాడే వ్యక్తులు పనులకు వచ్చి ఇంత శ్రమ తీసుకుంటారా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ నిబంధన కూలీలకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉందని అనేక మంది అభిప్రాయపడుతున్నారు.

**రెండు పూటలా హాజరు నమోదు చేయాలి**

ప్రతి గ్రూపునకు చెందిన మేట్ మొబైల్‌లో ఎన్ఎంఎంఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఎంతమంది కూలీలు పనులకు హాజరవుతామని డిమాండ్ చేస్తారో వాళ్ల గ్రూపునకు చెందిన మేట్ మస్టర్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. పని ఉన్న రోజున తొలుత ఉదయం 6 నుంచి 11 గంటల లోపు ఫొటో హాజరు పంపించాల్సి ఉంటుంది. ఉదయం ఎంతమంది పనికి హాజరవుతారో వారి పేర్లు మాత్రమే రెండవ పూట ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. రెండవ పూట హాజరు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పంపించాలి. గ్రామాలలో సిగ్నల్, సాంకేతిక సమస్య అధికంగా ఉంటుంది. ఈ యాప్ ఉపయోగించాలంటే కనీసం ఇంటర్ చదివిన వారైతే అర్థం చేసుకుంటారు. ఆన్‌లైన్‌లో పేర్లు ఇంగ్లీషులో ఉంటాయి. కూలీల పేర్లను చదవగలిగే వారైతే ఫరవాలేదు. లేదంటే వేరే వాళ్లకు హాజరు నమోదు చేసే అవకాశం ఉంటుంది.

**ఆధార్ ఉంటేనే వేతనం చెల్లింపు**

కూలీల చెల్లింపుల్లో అక్రమాలు జరగకుండా ఉండేందుకు వీలుగా ఆధార్ కార్డు ఉంటేనే వేతనం చెల్లిస్తామని కేంద్రం స్పష్టం చేసింది. దీనిలో భాగంగా ఉపాధి హామీ పథకంతో పాటు అందరికీ బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డులను క్షేత్ర సహాయకుల ద్వారా సేకరించి, వాటిని ఆన్ లైన్ చేశారు. గ్రామీణ అభివృద్ధి శాఖ పరిధిలోకి వచ్చే పనులకు బ్యాంకు ఖాతా, ఆధార్ తప్పనిసరి చేసింది. వేతనాల చెల్లింపునకు ఆన్ లైన్ హాజరుపై ఆధారపడాలన్న నిబంధన ఏ మేరకు సత్ఫలితాలను ఇస్తుందో వేచి చూడాలి.

> కేంద్రం కుట్రపూరితంగా ఈ యాప్ తీసుకొచ్చింది : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు
>
> కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను కుట్రపూరితంగా తీసుకువచ్చింది. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా కూలీల ఫొటో తీసి హాజరు పంపించాలంటే చాలా సమయం పడుతుంది. దేశమంతా ఈ యాప్‌లోనే పంపిస్తుండడంతో సర్వర్ సరిగా పనిచేయక అప్ లోడ్ కావడం లేదు. ఒక్కొక్కసారి హాజరు పంపించడం కష్టంగా ఉంటుంది. ముఖ్యంగా ఈ యాప్ వినియోగిస్తున్నందున స్మార్ట్ ఫోన్ హ్యాంగ్ అయి పాడవుతున్నాయి. ప్రభుత్వం పునరాలోచించాలి.

## జీఓ 1పై కోర్టుకు

(మొదటిపేజీ తరువాయి)

నడుస్తోందని విమర్శించారు. దీనిపై సజ్జల అన్ని పార్టీలకు జీవో వర్తిస్తుందని చెప్పటం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రాజమండ్రి వెళ్లినప్పుడు రోడ్లు బంద్ చేశారని, అయితే చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం వెళితే అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ జీవో ప్రజాస్వామ్యాన్ని ఏ మాత్రం కాపాడదని, ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తుందన్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, అక్కడ తగిన న్యాయం జరుగుతుందన్నారు.

**వేల కోట్లు ఖర్చు పెట్టి సెంటు భూమి**

రాష్ట్రంలో పేదల ప్రభుత్వం అని చెప్పుకునే ముఖ్యమంత్రి జగన్ వేల కోట్లు ఖర్చు పెట్టి శాశ్వత పరిష్కారం చూపకుండా కేవలం సెంటు భూమి చొప్పున పేదలకు ఇవ్వటం దారుణమన్నారు. దీనిపై తాము పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున నివేశన స్థలాలు ఇవ్వమని చెప్పామన్నారు. సెంటు స్థలం ఇచ్చి, రూ.1.80 లక్షలు మంజూరు చేయటం వల్ల గృహ నిర్మాణం ఏ మాత్రం పూర్తికాదన్నారు. టిడ్కో గృహాలు పట్టించుకోని పాలకులు సైంధవుని వలె అడ్డుపడుతున్నారని విమర్శించారు. సిమెంట్, ఇసుక ఉచితంగా ఇచ్చి గృహ నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయాలని, టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయాలని, లేకుంటే ఈ నెల 17 నుంచి లబ్ధిదారుల సంతకాలు సేకరించి, 30వ తేదీని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపడతామన్నారు. ఫిబ్రవరి 6న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 కలెక్టరేట్‌ల వద్ద భారీ ఎత్తున ధర్నా చేపడతామని తెలిపారు. అప్పటికి కూడా ప్రభుత్వం దిగి రాకుంటే ఫిబ్రవరి 22న రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల లబ్ధిదారులతో విజయవాడలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. పేదలకు శాశ్వతంగా గృహ నిర్మాణాలు జరగాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం వెనకడుగు వేయటం లేదన్నారు. సీఎం జగన్ దీనిపై మాట్లాడలేకపోతున్నారన్నారు. లాలూచీ పడుతూ విలువైన భూములు అమ్ముకోవాలని చూస్తున్నాడని ఆరోపించారు. ఈనెల 30న విశాఖ నగరంలో వేలాది మంది కార్మికులు నిర్వహించే 'కార్మిక గర్జన'కు సీపీఐ సహకారం అందిస్తుందన్నారు. ఈ నెల 23,24,25 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్‌ల వద్ద భారీ ఎత్తున నిరాహార దీక్షలు చేపడతామన్నారు. ఈ దీక్షలకు కార్మికులంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు.

**బీజేపీ సహకారంతోనే జగన్ డ్రామాలు**

బీజేపీ సహకారంతోనే సీఎం జగన్ డ్రామాలు చేస్తూ కేసులు వాయిదాలు వేయించుకుంటున్నారని రామకృష్ణ విమర్శించారు. రాష్ట్ర నాయకులు అమరావతి రాజధాని కావాలని అంటుంటే, కేంద్ర నాయకులు మాత్రం రాష్ట్ర నాయకుల ఇష్టమని చెప్పటం సరికాదన్నారు. ప్రధాన మంత్రి ఒక్కమాట ముఖ్యమంత్రికి చెబితే సరిపోతుందన్నారు. అమరావతి రాజధానికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేశాము. నేనే శంకుస్థాపన చేశానని ప్రధాని చెబితే ముఖ్యమంత్రి వినరా అని ప్రశ్నించారు. సీఎం జగన్ రాష్ట్రంలో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టాలని చూస్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ కలిసి కట్టుగా డ్రామాలు ఆడుతున్నారని, పరస్పరం సహకరించుకుంటున్నారని రామకృష్ణ విమర్శించారు. ఏప్రిల్‌లో రాజధాని విశాఖకు వెళుతున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేయండి చూద్దామని రామకృష్ణ సవాలు విసిరారు. ప్రజలను ఏప్రిల్ ఫూల్ చేయటానికి ఈ విధమైన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. విశాఖలో 50 వేల ఎకరాలు కబ్జా చేశారని, విశాఖ ప్రజల దృష్టి మరల్చటానికి విశాఖ రాజధాని అని ప్రగల్భాలు పలుకుతున్నారని తెలిపారు. వైసీపీ మంత్రులు, నాయకులు డ్రామాలు ఆపాలని, ఆంధ్రప్రదేశ్‌కు అమరావతే ఏకైక రాజధానిగా ఉంటుందని రామకృష్ణ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జంగాల అజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగాంజనేయులు, బాపట్ల జిల్లా సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్, ఏరియా కార్యదర్శి దుండి కనకారెడ్డి, ఏఐటీయూసీ కార్యదర్శి బత్తుల శ్యామ్యూల్, అధ్యక్షులు షేక్ కరిముల్లా, రేపల్లె నియోజకవర్గ కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ, చీరాల నియోజకవర్గ కార్యదర్శి సీహెచ్ ప్రకాష్, అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి టి.పూర్ణచంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## టీచర్లపై 'సంక్రాంతి' భారం

(మొదటిపేజీ తరువాయి)

ధోరణితో ప్రభుత్వం ఉంది. సీపీఎస్ రద్దు చేయాలంటూ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు పట్టుపడుతూ పెద్దఎత్తున ఉద్యమించారు. దానిపై ప్రభుత్వం స్పందించకుండా సీపీఎస్ స్థానంలో కొంతకాలంపాటు జీపీఎస్ తీసుకొచ్చింది. దానిని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో మధ్యేమార్గంగా నూతన పెన్షన్ విధానం తీసుకొస్తామంటూ ఇటీవల జరిగిన ప్రభుత్వ ఉన్నతాధికారుల సమావేశంలో తేల్చిచెప్పారు. అటు పీఆర్సీ అంశంలోనూ ఉపాధ్యాయులకు మేలు జరగలేదు.

చాలా మందికి నష్టం వాటిల్లింది. గతంలో ఎన్నడూ లేనంతగా వారికి ఆర్థికంగా నష్టం చేకూర్చిందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. మూడున్నరేళ్ల తర్వాత ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా తెరదీసింది. ఖాళీగా ఉన్న 30 వేలకు పైగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయకుండా, వాటిని సర్దుబాటు పేరుతో బదిలీలకు శ్రీకారం చుట్టింది. మూడున్నరేళ్ల నుంచి నూతన పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ ఇవ్వనందున... ప్రభుత్వ నిర్ణయం వల్ల లక్షలాది మంది నిరుద్యోగ ఉపాధ్యాయులు నడిరోడ్డున పడుతున్నారు.

**విద్యార్థుల బూట్ల కొలతలు తారుమారు**

పాఠశాల విద్యార్థుల బూట్ల కొలతలను ఉపాధ్యాయులు ఎంతో శ్రద్ధగా సమీకరించి, వాటిని విద్యాశాఖాధికారులకు పంపినప్పటికీ... తీరా ఇచ్చిన కొలతలకు భిన్నంగా అవి వస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల విద్యార్థుల కాళ్లకు సరిపడా కొలతలతో బూట్లు లేనందున ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా మందికి బిగువుగా, లూజుగా ఉంటున్నాయి. పాఠశాల విద్యార్థుల పేర్ల వారీగా, వారి కాళ్లకు కొలతలను ఉపాధ్యాయులు సేకరించి నివేదించిన విషయం విదితమే. తీరా బూట్ల జారీలో మాత్రం ఆ కొలతలకు తగినట్లుగా రావడం లేదు. ఈ వ్యవహారంలో ఉత్పత్తి రంగాల నిర్వాహకులు, అధికారుల మధ్య సమన్వయం లోపించినట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయులు బూట్ల కొలతలతో పాటు నిత్యం అనేక బోధనేతర పనులతో సతమతం అవుతున్నారు. మధ్యాహ్న భోజనం పథకం పర్యవేక్షణ, మరుగుదొడ్ల నిర్వహణ తీరు, వాటిపై ఫొటోల చిత్రీకరణ, విద్యార్థుల హాజరు, సెలవుల్లో బియ్యం పంపిణీ తదితర అంశాలను సంబంధిత యాప్‌లలో నమోదు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. వాటికితోడుగా సంక్రాంతి సెలవుల్లోనూ వారిపై సర్వేల నివేదిక వివరాలు పంపాలంటూ ఒత్తిడి పెంచడం తగదని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంక్రాంతి సెలవులు పూర్తయ్యాక ఆయా సర్వేల నివేదికలు ఇచ్చేలా గడువు పెంచాల్సిన అవసరం ఉంది.

## రైల్వేలో 3.12 లక్షల ఖాళీలు

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతోంది. ఉన్న ఉద్యోగులు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ఓవర్‌టైమ్‌లు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. రైల్వేలోని అన్ని పోస్టుల్లో తీవ్రమైన సిబ్బంది కొరత ఉన్నట్లు గతేడాది మార్చిలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. నేటికీ పరిస్థితుల్లో మార్పు లేదు.

దేశవ్యాప్తంగా 18 జోన్లలో 2022, డిసెంబరు 1 నాటికి 3.12 లక్షల నాన్-గెజెటెడ్ పోస్టులు భారతీయ రైల్వేలో ఖాళీగా ఉన్నట్లు ఓ నివేదిక తెలిపింది. అత్యధికంగా ఉత్తర జోన్‌లో 38,754 ఖాళీలు ఉంటే పశ్చిమంలో 30,476, తూర్పులో 30,141, సెంట్రల్ జోన్లలో 28,650 పోస్టులు భర్తీ కాలేదని చెబుతోంది. నాన్ గెజిటెడ్ పోస్టుల్లో ఇంజినీర్లు, టెక్నీషియన్లు, క్లర్కులు, స్టేషన్ మాస్టర్లు, టికెట్ కలెక్టర్ల ఉద్యోగాలు ఉంటాయి. రైల్వేలో తీవ్రమైన సిబ్బంది కొరత వల్ల చాలా వరకు టికెట్ బుకింగ్ కౌంటర్లు పనిచేయడం లేదు. ఫలితంగా టికెట్ కోసం భారీ క్యూలైన్లు, రద్దీ కనిపిస్తున్నట్లు 'ది హిందూ' నివేదిక తెలిపింది. 'ఏకధాటిగా 16 గంటలు అంటే డబుల్ షిఫ్టుల్లో పనిచేస్తున్నా. సరిపడ సిబ్బంది లేక రిలీవింగ్ ఉండటం లేదు. సిబ్బంది కొరత వల్ల చదువుకునే సమయం దొరకదు' అని ముంబైలో సెంట్రల్ రైల్వే టికెట్ బుకింగ్ కార్యాలయంలో పనిచేసే 29ఏళ్ల ఉద్యోగి వాపోయారు. ఈయన లా పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధిస్తే అంతర్‌విభాగ బదిలీపై న్యాయ విభాగానికి వెళ్లాలని భావిస్తున్నారు.

సెంట్రల్ రైల్వే 28,650 ఖాళీల్లో 14,203 పోస్టులు అంటే దాదాపు సగం సేఫ్టీ కేటగిరిలోనే ఉన్నాయి. ఈ విభాగంలో ఆపరేటింగ్-మెయింటెనెన్స్ సిబ్బంది అంటే ఇనస్పెక్టర్లు, డ్రైవర్లు, ట్రైన్ ఎగ్జామినర్లు, షంటర్లు ఉంటారు. గతేడాది నవంబరులో ఉద్యోగాల భర్తీ కోసం డిమాండ్ చేస్తూ ఛత్రపతి శివాజీ టెర్మినస్‌లో జాతీయ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎన్ఆర్ఎంయూ) శాంతియుతంగా ఆందోళన చేపట్టింది. 28,705 ఖాళీల భర్తీని డిమాండ్ చేసింది.

దాదాపు ఏడాది తర్వాత కూడా 24 శాతం పోస్టులు అంటే 1.19 లక్షల వర్కర్ల స్థానాలు ఖాళీగా ఉన్నట్లు 'హిందుస్తాన్ టైమ్స్' నివేదించింది. ఖాళీలను భర్తీచేసే విషయంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుండటంతో ఉన్న సిబ్బంది అదనపు పనిగంటలు పనిచేయాల్సి వస్తూ అవస్తలు పడుతున్నట్లు పేర్కొంది. తమ స్థానాల్లోకి వచ్చేవారు లేని కారణంగా పదోన్నతలనూ అంగీకరించలేని పరిస్థితిలో సిబ్బంది ఉన్నట్లు వెల్లడించింది. ఇటువంటి సమస్యల కారణంగా రైళ్ల పనితీరు, ట్రాక్‌ల నిర్వహణ తదితరాలపై ప్రభావం చూపుతున్నాయని, పర్యవసానంగా ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని తెలిపింది.

ఎన్ఆర్ఎంయూ ఉద్యోగి ఒకరు మాట్లాడుతూ, సిబ్బంది కొరత వల్ల టికెట్ సేవల అవుట్‌సోర్సింగ్ పెరిగిందని చెప్పారు. ప్రైవేటు వ్యక్తులు రూ.100 విలువ చేసే టికెట్‌పై రూ.3 చొప్పున ఆర్జిస్తున్నట్లు తెలిపారు. టికెట్ బుకింగ్ రైల్వే సిబ్బంది చేయాల్సిన పనని అన్నారు.

ఇదిలావుంటే, రైల్వే మంత్రి పార్లమెంటు ఎదుట ఉంచిన అధికారిక నివేదికలో ఖాళీలు ఏర్పడటం, వాటిని భర్తీ చేయడం నిరంతర ప్రక్రియని, పదోన్నతలు లేదా వేర్వేరు రిక్రూటింగ్ ఏజెన్సీల ద్వారా అవసరాన్ని బట్టి ఆయా ఉద్యోగాల్లో నియామకాలు జరుగుతాయని ఉంది.

నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీలలో 35,281 ఖాళీలను నియామక పద్ధతి ప్రకారం నేరుగా నియమించి ప్రక్రియను పూర్తి చేసినట్లు వెల్లడించింది. 2022 జనవరిలో రైల్వే నియామకాల బోర్డు ఎంపిక ప్రక్రియపై వేలాది మంది ఉద్యోగ ఆశావహులు వివిధ రకాల్లో ఆందోళనలు చేసిన ఏడాది తర్వాత కూడా గణాంకాలు నిరాశాజనకంగానే ఉన్నాయి. 40వేల ఉద్యోగాల కోసం 10 మిలియన్లు అంటే కోటి మంది పోటీపడటాన్ని బట్టి దేశంలో నిరుద్యోగం ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు.

**సీఎస్ సోమేశ్‌కుమార్**

# ఏపీ క్యాడర్‌కు వెళ్లాల్సిందే

**టీఎస్ హైకోర్టు కీలక తీర్పు**

**విశాలాంధ్ర - హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు రాష్ట్ర హైకోర్టు షాక్ ఇచ్చింది. కొంతకాలంగా హైకోర్టులో కొనసాగుతున్న సోమేశ్‌కుమార్ సీఎస్ పదవి కేసులో తుది తీర్పు వెలువరించింది. వెంటనే ఏపీ క్యాడర్‌కు వెళ్లాలని హైకోర్టు ఆదేశించింది. గతంలో కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. రాష్ట్ర విభజనప్పుడు సోమేశ్‌కుమార్‌ను కేంద్రం ఏపీకి కేటాయించింది. అయితే కేంద్రం ఉత్తర్వులను నిలిపివేస్తూ... సోమేశ్ తెలంగాణలోనే కొనసాగేలా గతంలో క్యాట్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన తెలంగాణలో కొనసాగుతున్నారు. క్యాట్ ఉత్తర్వులు కొట్టివేయాలని 2017లో హైకోర్టును కేంద్రం ఆశ్రయించింది. క్యాట్ ఉత్తర్వులు కొట్టివేస్తూ సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ బెంచ్ మంగళవారం తీర్పునిచ్చింది. సోమేశ్‌కుమార్ తరపు న్యాయవాది తీర్పు అమలు 3 వారాలు నిలిపివేయాలని కోరినా హైకోర్టు ఎలాంటి సమయం ఇవ్వలేదు. 3 వారాలు సమయం కావాలన్న సోమేశ్‌కుమార్ తరపు న్యాయవాది అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టును సోమేశ్ కుమార్ ఆశ్రయించనున్నారు. అయితే తీర్పు కాపీ రాగానే ఏపీకి వెళ్లిపోవాలని హైకోర్టు స్పష్టం చేయడం గమనార్హం.

**సీఎస్‌ను రిలీవ్ చేయాలని డీవోపీటీ ఆదేశాలు...పరిశీలనలో ముగ్గురు**

సీఎస్ సోమేశ్ కుమార్ వెంటనే రిలీవ్ కావాలని హైకోర్టు తీర్పు ఇచిన కొన్ని గంటల్లోనే ఆ మేరకు డీవోపీటీ ఆదేశాలు జారీ చేసింది. ఆయన వెంటనే తెలంగాణనుంచి రిలీవ్ అయ్యి ఈనెల 12 లోపు ఏపీ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని స్పష్టం చేసింది. కాగా హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తో సీఎస్ భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నూతన సీఎస్ నియామకం పై దృష్టి సారించింది. ఇప్పటికే ముగ్గురు పేర్లను సీఎం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇందులో ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణరావుకు బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అదే సమయంలో అరవింద్ కుమార్, రజత్ కుమార్ పేర్లను కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

## ఉపేక్షించరాదు...

(మొదటిపేజీ తరువాయి)

అడ్డుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. అల్లర్ల గురించి సమాచారం ఉన్నాగానీ పోలీసులు ఏం చేస్తున్నట్లని నిలదీశారు. బ్రెసిలియా పోలీసులు - ఇంటెలిజెన్స్ అలసత్వం ఆక్షేపణీయమని లూలా అన్నారు. దాడి జరగవచ్చు అన్న సమాచారాన్ని భద్రతా సిబ్బంది పట్టించుకోలేదని గవర్నర్లతో జరిపిన సమావేశంలో అధ్యక్షుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. విధ్వంసకారులతో పోలీసులు మాట్లాడుతుండటం వీడియోల్లో కనిపిస్తోందని, ఈ దాడులకు సూత్రధారులను వదిలిపెట్టబోమని లూలా ద సిల్వా తేల్చిచెప్పారు.

# పేదలకు అండ కమ్యూనిస్టు పార్టీ

- కులోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడిన యోధ పేరయ్య
- సంస్మరణ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**విశాలాంధ్ర-మద్దిపాడు:** పేదల పక్షాన నిలబడి, కుల ఉన్మాదానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు పొత్తూరి పేరయ్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కొనియాడారు. ప్రకాశంజిల్లా మద్దిపాడు మండలం మారెళ్ల గుంట పాలెం సమీపంలోనే సరోజ్ సేవ ఫౌండేషన్ ఆసరా కేంద్రం ఆవరణంలోని పొత్తూరి సుబ్బమ్మ- పేరయ్య కమ్యూనిటీ హాలులో మంగళవారం పొత్తూరి పేరయ్య సంస్మరణ సభ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) అధ్యక్షతన జరిగింది. తొలుత నన్నపనేని అంజయ్య వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. పొత్తూరి పేరయ్య- సుబ్బమ్మ చిత్రపటానికి పూలమాలవేసి రెండు నిమిషాల పాటు నివాళులర్పించారు. మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన నిలబడి కులోన్మాదానికి అలుపెరగని పోరాటం చేసిన యోధుడు పొత్తూరి పేరయ్య అన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని రామకృష్ణ చెప్పారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో కమ్యూనిస్టు పార్టీకి మంచి విలువలు ఉన్నాయనీ, భూమి అంతరించే వరకు కమ్యూనిస్టు పార్టీలు ఉంటాయని తెలిపారు. అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ ప్రస్తుతం కమ్యూనిస్టులకు అసెంబ్లీలో ఒక్క స్థానం కూడా లేదని వారు మనుగడ కొనసాగించలేరని కొన్ని పార్టీలు శాపనార్థాలుగానే మాట్లాడుతున్నాయే తప్ప ప్రజల సమస్యలు ఉన్నంతకాలం కమ్యూనిస్టు పార్టీలు ఉంటాయన్నారు. పేరయ్య కుటుంబ సభ్యులు నేటికీ కమ్యూనిస్టు పార్టీలోనే పనిచేస్తున్నారని వారి కుటుంబం నాటి, నేటి తరాలకు ఆదర్శమని ఆయన అన్నారు. నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఎద్దడి ఏర్పడినప్పుడు రైతు వర్గానికి, దళిత వర్గానికి జరిగిన పోరాటంలో దళితులు పక్షాన నిలబడి తాగునీటి అవసరాలు తీర్చేందుకు పేరయ్య కృషి అసమానమన్నారు. ఆనాటి జిల్లా కలెక్టర్, పోలీసులు సహాయంతో మంచినీటి చెరువు నుంచి దళితులు నీళ్లు తోడుకునేందుకు అవకాశం కల్పించే విధంగా పోరాడిన యోధుడు పొత్తూరి పేరయ్యని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్, సరోజ్ సేవ ఫౌండేషన్ అధ్యక్షులు చెడిపోతు వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర నాయకులు పూనాటి ఆంజనేయులు, సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఐ ఎంఎల్ జనశక్తి నాయకులు స్వామి, మహిళా సమాఖ్య నాయకులు కె. అరుణ, ఆసరా కార్యవర్గ సభ్యులు నాతాని భూపతి రావు, ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు తదితరులు పొత్తూరి పేరయ్య కుటుంబ సభ్యులు పార్టీకి మరియు పెద్దకొత్తపల్లి పంచాయతీ గ్రామాలలోని చేసిన సేవా కార్యక్రమాలను, వారితో ఉన్నటువంటి అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు చంద్రానాయక్, సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు ప్రకాశరావు, ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి, సహాయ కార్యదర్శి బొమ్మిశెట్టి చంద్రశేఖర్, ఏఐటీయూసీ నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, కె అంజయ్య, మారెళ్లగుంట పాలెం గ్రామ శాఖ కార్యదర్శి నల్లూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## శ్యామజోషి మృతి

**విశాలాంధ్ర-హైదరాబాద్:** ఆర్మేనియా, జార్జియ, మంగోలియా దేశాలలో పనిచేసిన భారత మాజీ రాయబారి టి.సురేష్ సతీమణి, సీపీఐ నాయకులు, విజయవాడ నగర మొదటి మేయర్ అమరజీవి టి వెంకటేశ్వరరావు రెండో కోడలు శ్యామ జోషి (65) మంగళవారం ఉదయం ఏడు గంటలకు జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లోని వారి స్వగృహంలో గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. శ్యామ జోషి మాస్కో యూనివర్సిటీలో రష్యన్ భాషలో ఎంఏ పీహెచ్‌డీ చేశారు. దిల్లీ, సిమ్లా విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్‌గా పని చేశారు. శ్యామ జోషి జన్మస్థలం హిమాచల్ ప్రదేశ్. వారి కుమార్తె జర్నలిస్టుకాగా, అల్లుడు న్యాయవాది. శ్యామ జోషి మృతికి సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఫ్రెండ్స్ ఫోరం సభ్యులు సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. శ్యామ జోషి అంత్యక్రియలు జూబ్లీహిల్స్ ఫిలింనగర్ మహాప్రస్థానంలో బుధవారం మధ్యాహ్నం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## జగనన్న కాలనీలలో ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలి

సీపీఐ నేత అక్కినేని వనజ డిమాండ్

**విశాలాంధ్ర - ఏలూరు:** రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలలో ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలని లేనిపక్షంలో ఇల్లు నిర్మించుకునేందుకు ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఉచితంగా ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక స్ఫూర్తి భవనంలో సన్నేపల్లి సాయిబాబా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అక్కినేని వనజ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రతి లబ్ధిదారులకి రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు లబ్ధిదారులతో సంతకాలు సేకరించి సంబంధిత రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు సీపీఐ ఆధ్వర్యంలో అందించాలని ఆమె కోరారు. డీడీలు కట్టిన లబ్ధిదారులకు టీడీపీ ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన టిడ్కో ఇళ్లను తక్షణమే అప్పగించాలని ఆమె డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను వ్యతిరేకిస్తూ జనవరి 23, 24, 25 తేదీలలో సీపీఐ, ఏఐటీయూసీ నిర్వహించ తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలలో సీపీఐ, ఏఐటీయూసీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జీవో నం.1రద్దు కోసం జరిగే ఉద్యమాలలో సీపీఐ, పజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వనజ పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య జిల్లాలో కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, ఎండి మునీర్, కారం దారయ్య, ఉప్పులూరి హేమ శంకర్, పుప్పాల కన్నబాబు, ఎం. వెంకటాచారి, బాడిస రాము, బత్తుల వెంకటేశ్వరరావు, కొండేటి బేబి, కంచర్ల గురవయ్య, జమ్మి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉపాధ్యాయులకు డ్రాయింగ్ అధికారాలు కల్పించాలి

పాఠశాల విద్యా సంయుక్త సంచాలకులకు ఎస్టీయూ వినతి

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులకు డ్రాయింగ్ అధికారాలు, భవిష్యనిధి సౌకర్యం కల్పించడానికి ఇంకెంత కాలం పడుతుందనీ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ-ఏపీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న విద్యాధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నంలోని పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర సంయుక్త సంచాలకులు మువ్వ రామలింగాన్ని కలిసి ఉపాధ్యాయుల సమస్యలపైన చర్చించి వినతి పత్రం సమర్పించారు. తిమ్మన్న మాట్లాడుతూ జీఓ 84 ప్రకారం మున్సిపల్ ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వ భవిష్యనిధి సౌకర్యం అదే విధంగా మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డ్రాయింగ్ అధికారాలు తక్షణమే ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులందరితో పాటు మున్సిపల్ ఉపాధ్యాయులకూ తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలన్నారు. వారికి ఈ అధికారాలు లేనందువల్ల చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఆరు నెలలుగా వేల కొద్దీ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సంపాదిత సెలవు బిల్లులు, ఇంక్రిమెంట్లు తదితర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపైన సీఎం ఇప్పటికే చాలాసార్లు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించారని, అయినప్పటికీ ఇంకా డ్రాయింగ్ అధికారాలు భవిష్య నిధి సౌకర్యం లాంటి సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఉపాధ్యాయ బదిలీలను పారదర్శకంగా నిబంధనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా త్వరగతిన పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్రాంతి పండుగ సెలవులు 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఇచ్చారనీ, ఆ సెలవుల్లో బడిఈడు పిల్లలపై సర్వేను పూర్తిచేసి సమర్పించాలని ఒత్తిడి చేయడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయులను ప్రశాంతంగా సంక్రాంతి పండుగ జరుపుకోనివ్వాలని, సంక్రాంతి సెలవుల తర్వాతే ఆ సర్వే అంశాలు అందజేసేలా గడువు ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ సాధించుకోవాలి

ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు జయలక్ష్మి, దుర్గాభవాని

**విశాలాంధ్ర-ఒంగోలు:** చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జయలక్ష్మి, దుర్గాభవాని పిలుపునిచ్చారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో మంగళవారం ఏపీ మహిళా సమాఖ్య ప్రకాశం జిల్లా సమితి నిర్మాణ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మహిళా సమాఖ్య ప్రకాశం జిల్లా సమితి అధ్యక్షురాలు ఎం.విజయ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరయిన మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధన కోసం ఏపీ మహిళా సమాఖ్య 85 సంవత్సరాల క్రితమే ఏర్పడిందన్నారు. స్త్రీ విద్య కోసం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, స్త్రీల మరుగుదొడ్ల కోసం, ప్రతి గ్రామంలో ప్రసూతి కేంద్రాల కోసం, వితంతువులకు పునర్వివాహాల కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈ పోరాటాల ద్వారా ప్రస్తుతం మహిళలు ఉన్నత విద్యను అభ్యసిస్తూ విద్యా రంగంలో దూసుకుపోతున్నారన్నారు. నేడు ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్మాణాలు జరిగాయని, బాల్య వివాహాలు చాలా వరకు తగ్గాయని, వితంతువులకు తిరిగి వివాహం చేయటం సర్వసాధారణమైందన్నారు. అంతేకాకుండా విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలు భరణాలు సాధిస్తున్నారన్నారు. ఆస్తిలో సమాన హక్కును నేడు అనుభవిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంత మహిళల కోసం ఉపాధి హామీ చట్టాన్ని సాధించామన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా అనేక అంశాలను ప్రజలకు తెలియపరచడం జరుగుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు ఇప్పటికే అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కోసం అనేక పర్యాయాలు ప్రయత్నాలు చేసినప్పటికీ అన్ని రాజకీయ పార్టీలు వీటిని వ్యతిరేకిస్తున్నాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి చట్టసభల్లో కూడా 33 శాతం రిజర్వేషన్లు సాధించగలమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్ సాధించామన్నారు. కేంద్రంలోని మోదీ పాలనలో గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయని విమర్శించారు. అయితే ఆదాయాలు మాత్రం పెరగలేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నోట్ల రద్దుతో ప్రజా జీవనం అతలాకుతలమైందని అన్నారు. మహిళలందరూ సంఘటితమై పోరాటాలు చేయడం ద్వారానే తమ హక్కులను కాపాడుకోగలరని తెలిపారు. మరో ముఖ్యఅతిథిగా హాజరయిన మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం ప్రతి మహిళ పోరాడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దోపిడీని ఎదుర్కోవాలని అన్నారు. నిరంతరం పాలకులు చేస్తున్న మోసాలను గుర్తించి ప్రశ్నించాలని అన్నారు. సబ్సిడీల పేరుతో జరుగుతున్న దోపిడీని నిలదీయాలన్నారు. మహిళలపై జరుగుతున్న హత్యలను, అత్యాచారాలను, దాడులను వెంటనే గుర్తించి తగు రీతిలో స్పందించడం ద్వారా వారికి న్యాయం జరిగే అవకాశం ఉందని తెలిపారు. మహిళలు వంటింటికే పరిమితమైనంత కాలం వారి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న తీరుగా ఉంటుందన్నారు. మహిళలు ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాటాలు చేయడం ద్వారానే సాధించుకోగలుగుతారన్నారు. సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎం.వెంకయ్య మాట్లాడుతూ సంఘం ద్వారానే బలం పెరుగుతుందన్నారు. ప్రతి మహిళ సంఘంతో పాటుగా తమ చుట్టుపక్కల ఉన్న మహిళలను సంఘంలో చేర్పించి, సమస్యలపై పోరాటాలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రావమ్మ, ఉపాధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 'సిద్ధార్థ' ఉద్యోగుల ఆందోళన తాత్కాలిక విరమణ

**విశాలాంధ్ర-విజయవాడ:** సిద్ధార్థ ప్రభుత్వం వైద్య కళాశాలలో వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామి ఇచ్చారు. దీంతో వైద్య ఉద్యోగులు చేపట్టిన ఉద్యమానికి తాత్కాలిక విరమణ ప్రకటించారు. కళాశాలలో పని చేస్తున్న వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏపీఎంఈయూ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం రెండవ రోజు మంగళవారం కూడా కొనసాగింది. దీనిపై ఉన్నతాధికారులు యూనియన్ నాయకులను చర్చలకు ఆహ్వానించారు. యూనియన్ బ్రాంచ్ సమస్యలపై కళాశాల ప్రిన్సిపల్, అడ్మినిస్ట్రేషన్ అధికారులతో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వి.బాలయ్య, ప్రధాన కార్యదర్శి ఎ.గిరిబాబు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.అప్పారావు, కోశాధికారి వీరాసాయివల్లి, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మణమూర్తి చర్చలు జరిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ ప్రిన్సిపల్ పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. దీనితో ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు యూనియన్ నాయకులు ప్రకటించారు. సమస్యలు పరిష్కారం కాని యెడల తిరిగి పోరాట కార్యక్రమం చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు జి.జగన్‌మోహన్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏవీ వీరాస్వామి, కార్యదర్శి యూవీ రామరాజు, కోశాధికారి జి.రాజమౌళి, ఉపాధ్యక్షులు సీహెచ్.భాస్కరరావు, సహాయ కార్యదర్శి కె.లక్ష్మణ, కార్యవర్గ సభ్యులు ఎం.శేషయ్య, యు.చంద్రం, బి.అన్నవరం, వై.శ్రీనివాసరావు, పి.ప్రకాశరావు, ప్రసాద్, కె.దుర్గమ్మ, పి.లీలా తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్‌లు పరిష్కరించాలి

ఏపీ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డులో నిలిచిన కార్మికుల క్లెయిమ్‌ల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఏపీ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏపీ కార్మిక శాఖ కమిషనర్‌కు మంగళవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, కార్యదర్శి షేక్ ఉమర్ వలి తదితరులు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. మూడేళ్ల నుంచి దాదాపు 32 వేలకు పైగా క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సంబంధించిన నిధులు మంజూరు చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2005లో భవన నిర్మాణ రంగ కార్మికులను ఆదుకునేందుకుగాను ఆంధ్ర ప్రదేశ్ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక... సంక్షేమ బోర్డు నుంచి అవి పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ప్రమాద, సహజ మరణాలు, శాశ్వత అంగవైకల్యం, పాక్షిక వైకల్యంతో నష్టపోయిన కార్మికుల కుటుంబానికి ఇచ్చే పారితోషికాలు అందడం లేదని తెలిపారు. మూడేళ్ల నుంచి దాదాపు 32 వేలకు పైగా క్లెయిమ్‌లు నిలిచిపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్మికుల సంక్షేమం కోసం తమ వద్ద నుంచి సభ్యత్వ రూపంలోను, యజమాని నుంచి సెస్ రూపంలో వసూలు చేసిన కోట్లాది రూపాయలను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసమే వసూలు చేయాలని న్యాయస్థానం ఆదేశించిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని, కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని వివరించారు. తక్షణమే సంక్షేమ బోర్డును సరైన గాడిలో పెట్టి సక్రమంగా నడిపించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ విజయవాడ టౌన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సిహెచ్.రమణ, నాయకులు రామస్వామి, గుంత వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 698వ రోజుకు ఉక్కు దీక్షలు

**విశాలాంధ్ర-కూర్మన్నపాలెం:** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరి రక్షణ పోరాట కమిటీ అధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 698వ రోజుకు చేరుకున్నాయి. కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరంలో మంగళవారం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వీఎఫ్ విభాగం కార్మికులు కూర్చుని నిరసన తెలిపారు. ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. 100% విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ దుర్మార్గపు నిర్ణయానికి వ్యతిరేకంగా చేస్తున్న ఈ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే రాష్ట్రమంతా ఉక్కు కార్మిక బస్సు యాత్రలు నిర్వహించాలన్నారు. తద్వారా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ఈ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచవచ్చారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు కామ్రేడ్ డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎస్. రామారావు, జె.రామకృష్ణ, యు. రామస్వామి, కారు రమణ, సీహెచ్ సన్యాసిరావు, మహాలక్ష్మి నాయుడు, డి.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌పై, కార్మికులపై కక్ష కట్టిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండి పట్టువీడి విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. డిపార్ట్మెంట్ నాయకులు వి.రామకోటేశ్వరరావు మంత్రి రవికిరణ్, టి.ఈశ్వరరావు, పీవీ నగేష్, అప్పారావు, నల్ల రవి, శ్రీనివాసరాజు, రొంగలి వెంకట్రావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మాంస ఉత్పత్తి పరిశ్రమల స్థాపనకు సహకారం

**విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:** రాష్ట్రంలోని మాంస ఉత్పత్తి రంగాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్- విజయవాడ, పశుసంవర్థక శాఖ సంయుక్తంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో మంగళవారం విజయవాడలో సదస్సు నిర్వహించారు. దీనికి మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ ఎం.రాములు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పశు సంవర్థక శాఖ సంచాలకులు ఆర్.అమరేంద్రకుమార్ హాజరయ్యారు. ప్రముఖ మాంస ఉత్పత్తి పరిశ్రమలలైన లీషియస్, కంట్రీ చికెన్, శ్రీనివాస ఫారమ్స్, అల్ సమి ఆగ్రో, మీట్ ప్రొడక్ట్స్, లాహామ్ ఫుడ్ ప్రొడక్ట్స్, వైజాగ్ ఫుడ్స్, ఫోర్క్‌జా మొదలగు సంస్థల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు వివరాలు తెలుసుకున్నారు. తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందజేస్తామని అమరేంద్ర కుమార్ తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విజయుడు, అధికారులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

## అందుకే జీవో-1 తెచ్చాం

అదనపు డీజీపీ రవిశంకర్

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** ప్రజల రక్షణ, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా, అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ఉండటం కోసమే జీవో నంబరు-1 తెచ్చారని, 1861 పోలీస్ యాక్టుకు లోబడే ఆ జీవోను విడుదల చేసినట్లు అదనపు డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. ఆయన మంగళవారం మంగళగిరి డీజీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. షరతులకు లోబడి సభలు, సమావేశాలకు అనుమతిస్తామని చెప్పారు. సభలు, సమావేశాలపై నిషేధం లేదన్నారు. వాటిపై నిషేధమున్నట్లు తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. ఇటీవల జరిగిన ఘటనల దృష్ట్యా ఈ జీవో తెచ్చినట్లు తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా సభలు నిర్వహించుకోవాలని సూచించారు. పోలీసులు వేదిక స్థలాన్ని పరిశీలించి అనుమతిస్తారని తెలిపారు. రహదారులు, రోడ్లపై సభలకు అనుమతిలేదనీ, అత్యవసరమైతే అనుమతులతో నిర్వహించుకోవచ్చని వెల్లడించారు. లా అండ్ ఆర్డర్ డీఐజీ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ చట్టం దేశవ్యాప్తంగా అమలవుతోందని చెప్పారు. సన్నగా, ఇరుగ్గా ఉండే రోడ్ల మీద నిర్వహించే సభల వల్ల ప్రజలకు ఇబ్బంది ఏర్పడుతుందని, అంబులెన్సులు, విమాన ప్రయాణాల కోసం వెళ్లే వారికి సమస్యలు తేవద్దని సూచించారు.

## ఇంజినీరింగ్, ఫార్మసీ సెమిస్టర్ల షెడ్యూలు

**విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:** రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ మొదటి సెమిస్టర్ చివరి పరీక్షలను ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖ ఆదేశించింది. ఈనెల 28వ తేదీ నాటికి ఇంజినీరింగ్, ఫార్మసీకి చెందిన మొదటి సెమిస్టర్ పూర్తి కావాలని తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామలారావు ఉత్తర్వులు జారీజేశారు. రెండో సెమిస్టర్ తరగతులను ఫిబ్రవరి 14 నుంచి 21 తేదీ వరకు పూర్తిచేసి, మే 23 నుంచి పరీక్షలు నిర్వహిస్తారు. రెండో సంవత్సరం మూడో సెమిస్టర్ తరగతులు ఫిబ్రవరి 25తో పూర్తిచేసి, 27 నుంచి పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే విద్యా సంవత్సరం మూడో సెమిస్టర్ తరగతులు జూన్ 6 నుంచి ప్రారంభమవుతాయి. నాల్గో సెమిస్టర్ మార్చి 13 నుంచి జూన్ 17 వరకు జరుగుతాయి. వాటికి 19వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహిస్తారు. ఐదో సెమిస్టర్ జులై 31 నుంచి ఉంటుంది. మూడో ఏడాది ఆరో సెమిస్టర్ తరగతులు ఏప్రిల్ 22తో పూర్తిచేసి, 24 నుంచి పరీక్షలు ఏర్పాటు చేస్తారు. ఏడో సెమిస్టర్ జూన్ 6న ప్రారంభమవుతుంది. నాలుగో ఏడాది ఎనిమిదో సెమిస్టర్ తరగతులను ఏప్రిల్ 22వ తేదీతో పూర్తి చేసి, అదే నెల 24 నుంచి పరీక్షలు నిర్వహిస్తారు. రెండు నెలల ఇంటర్న్‌షిప్‌ను మే 8 నుంచి నిర్వహిస్తారు.

## వరికోత యంత్రం బోల్తా ఇద్దరు మహిళల మృతి

మరో ఇద్దరికి గాయాలు

**విశాలాంధ్ర-బొబ్బిలి:** వరి నూర్పిడి యంత్రం బోల్తా పడి ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన గేదెల శ్రీదేవి, మడక సత్యవతిని 108 వాహనంలో బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వారిని విజయనగరం మహారాజు ఆసుపత్రికి సిఫార్సు చేశారు. మృతులను విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం అన్నమనాయుడు వలసగ్రామానికి చెందిన గోర్జి తిరుపతమ్మ(50), పోల లక్షణమ్మ(48)గా గుర్తించారు. వరికోత కోసం అన్నంనాయుడు వలస గ్రామం నుంచి ట్రాక్టర్ ఇంజన్‌కు వరి నూర్పిడి యంత్రం కట్టి వెళుతుండగా దానికి రెండువైపులా నలుగురు చొప్పున మహిళలు కూర్చున్నారు. పొలం గట్టుమీద యంత్రం ఒక్కసారిగా బోల్తాపడి మహిళలలో ఇద్దరు మరణించారు. సీతానగరం మండలం జానుములవలస వరిచేను మట్టించడానికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఎస్సై చదలవాడ సత్యనారాయణ కేసు నమోదు చేసి మృతదేహాల్ని పోస్ట్‌మార్టం కోసం బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సంపాదకీయం

# గీత దాటుతున్న గవర్నర్

రాజ్యాంగాన్ని ఖరారు చేస్తున్నప్పుడు అనేక అంశాల మీద లోతైన చర్చలే జరిగాయి. గవర్నర్ల వ్యవస్థ అవసరమా కాదా అన్న అంశం మీదా వాదోపవాదాలు జరిగాయి. చివరకు గవర్నర్ల వ్యవస్థ ఉండాలని అనుకున్నారు. దేశమంతటా ఒకే రాజకీయ పార్టీ పెత్తనం కొనసాగినప్పుడు గవర్నర్లుగా ఉన్న వారు అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలతో ఘర్షణపడ్డ సందర్భాలు చాలా తక్కువ. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఒకటైతే రాష్ట్రాల్లో భిన్న పార్టీలు అధికారంలో ఉంటే కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య అనుసంధాన కర్తలుగా ఉండవలసిన గవర్నర్లు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఏజెంట్లుగా వ్యవహరించడం బాగా పెరిగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ఏదీ చేసినా అడ్డు తగిలే గవర్నర్లు తయారయ్యారు. మహా రాష్ట్ర గవర్నర్ కోషియారీ, కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి తమ రాజ్యాంగ బాధ్యతలను అటకెక్కించి కేవలం కేంద్ర ప్రభుత్వానికి బంట్లుగా పని చేస్తున్నారు. జగ్దీప్ ధన్కర్ బెంగాల్ గవర్నరుగా ఉన్నప్పుడూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఈ రాష్ట్రాలన్నింటిలో బీజేపీయేతర పార్టీలే అంటే ప్రతిపక్షాలే అధికారంలో ఉన్నాయి. అందువల్ల ఈ రాష్ట్రాల గవర్నర్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి వత్తాసుదార్లుగా వ్యవహరిస్తున్నారు. అక్కడితో ఆగినా బాగుండేది అలా కాకుండా తాము గవర్నర్లుగా ఉన్న రాష్ట్రాలలో ప్రతిపక్ష నాయకుల పాత్ర పోషిస్తున్నారు. గవర్నర్లుగా ఎవరిని నియమించాలన్న సంప్రదాయాలను కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు తుంగలో తొక్కుతూనే వచ్చాయి. రాజకీయంగా తమకు అనుకూలమైన వారినే నియమిస్తున్నారు. మరీ చెప్పాలంటే క్రియాశీల రాజకీయాల్లో ఉన్న వారిని లేదా ఉన్నతాధికారులుగా ఉన్నప్పుడు తమకు అనుకూలంగా వ్యవహరించిన వారిని గవర్నర్లుగా నియమిస్తున్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ ధోరణి మరీ పెచ్చరిల్లిపోయింది. ఆర్.ఎస్.ఎస్. తో సన్నిహిత సంభంధం ఉన్న వారిని గవర్నర్లుగా నియమిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఏరికోరి సంఘ్ పరివార్‌తో సన్నిహిత సంబంధం ఉన్న వారిని నియమిస్తున్నారు. ఉన్నతాధికారుల్లో కూడా అలాంటి వారిని వెతికి గవర్నర్ పదవి కట్టబెడ్తూ వారి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపుతున్నారు. సంపూర్ణమైన రాష్ట్ర స్థాయి లేని దిల్లీలాంటి చోట లెఫ్టినెంట్ గవర్నర్లు ఇష్టారాజ్యం చెలాయించడాన్ని అర్థం చేసుకోవచ్చు. అక్కడ సకలాధి కారాలు గవర్నర్లకు పనిగట్టుకుని కట్టబెట్టారు. కానీ పూర్తి రాష్ట్ర ప్రతిపత్తి ఉన్న రాష్ట్రాలలో, ముఖ్యంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్లుగా ఉన్న వారూ విలోమ పాత్రే పోషిస్తున్నారు. నిరపేక్షంగా ఉండవలసిన గవర్నర్లను తమ చెప్పు చేతుల్లో పని చేసే వారి స్థాయికి దిగజార్చడమే దీనికి ప్రధాన కారణం. గవర్నర్ పదవులను ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో గూఢ చార సమాచారం సేకరించే స్థాయికి దిగజార్చారు. ఇలా వ్యవహరిస్తున్న గవర్నర్లలో చాలా మంది కేవలం రాజకీయ నాయకులు కారు. వారికి తగిన అనుభవం ఉంది. వారిలో పాండిత్యం ఉన్న వారూ ఉన్నారు. లేదా సుదీర్ఘ కాలం ఉన్నతాధికారులుగా పని చేసిన వారూ ఉన్నారు. అయినా వారి ప్రవర్తన పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికి నమ్మిన బంట్లుగా ఉండడానికే పరిమితం అవుతోంది. ఇది గవర్నర్ల స్థాయిని దిగజార్చడమే కాదు, అసలు ఆ వ్యవస్థే అనవసరం అన్నీ వాదనలు సబబేనన్న దశకు చేరుకున్నాయి.

తాజాగా తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి మరోసారి వివాదాస్పద పాత్ర పోషిస్తున్నారు. చాలా స్వల్ప వ్యవధిలో ఆయన రెండు సందర్భాలలో వివాదాలకు తెర లేపారు. మొదటిది, శాసన సభ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగం చదవడానికి బదులు తన సొంత అభిప్రాయాలు చేర్చి చదివారు. ప్రతి ఏడాది శాసనసభ సమావేశాలు ప్రారంభం అయ్యే రోజున గవర్నర్లు చట్ట సభలను ఉద్దేశించి ప్రసంగించడం ఆనవాయితీ. ఈ ప్రసంగం గవర్నర్ అభిప్రాయ వ్యక్తీకరణ కాదు. అది రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాల వ్యక్తీకరణే. అందుకే ఆ ప్రసంగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సిద్ధం చేస్తుంది. దాన్ని చదవడమే గవర్నర్ చేయవలసిన పని. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసే ప్రసంగం కూడా ఇదే రీతిలో ఉంటుంది. రాష్ట్రపతి పదవిలో లేదా గవర్నర్ పదవిలో హేమా హేమీలు ఉన్నా వారు ఈ సంప్రదాయానికి కట్టుబడే తమ బాధ్యత నిర్వర్తించారు. అక్కడక్కడా కొన్ని మినహాయింపులు ఉండొచ్చు. కానీ తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవిలాగా బాహాటంగా సంప్రదాయాన్ని ఉల్లంఘించిన వారు తక్కువే కనిపిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగానికి తన అభిప్రాయాలు జోడించి గవర్నర్ రవి శాసనసభలో ప్రసంగించి నందుకు సహజంగానే తమిళనాడు ప్రభుత్వం ఇబ్బంది పడవలసి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి స్టాలిన్ గవర్నర్ ప్రవర్తనను తప్పు పడ్తూ ఒక తీర్మానం ప్రవేశ పెట్టవలసి వచ్చింది. గవర్నర్ సకల సంప్రదాయాలనూ విస్మరించి విసవిసా శాసనసభలోంచి వెళ్లిపోయారు. అంటే ఆయన ఒక రకంగా నిరసనగా వాక్ అవుట్ చేశారు. గవర్నర్ రవి సృష్టించిన రెండో వివాదం ఇంతకన్నా తీవ్రమైంది. తమిళనాడు పేరును తమిజగంగా మార్చేయాలని గవర్నర్ రవి ప్రయత్నిస్తున్నారు. తమిళనాడు అంటే తమిళుల జాతి అని అర్థం. తమిజగం అంటే తమిళ ప్రజల నెలవు. ఈ రెండో పేరు వాడాలని గవర్నర్ దీక్షబూనినట్టు వ్యవహరిస్తున్నారు. తమిళనాడు పేరు తమిజగంగా మార్చేయాలని గవర్నర్ సంకల్పం. ఈ అధికారం ఆయనకు లేకపోయినా ఆ పని చేయాలనుకుంటున్నారు. దీనికి కారణం లేకపోలేదు. ఆయనకు ప్రేరణ కూడా ఉంది. బీజేపీ కూడా తమిజగం అనే అంటుంది. సంక్రాంతి పండగ సందర్భంగా గవర్నర్ కార్యాలయం నుంచి ఓ ఆహ్వానం వెలువడింది. అందులో పనిగట్టుకుని తమిళనాడు అని కాకుండా తమిజగం అన్న మాట వాడారు. కిందటిసారి తమిళ సంవత్సరాది సందర్భంగా పంపిన ఆహ్వాన పత్రికలో కూడా తమిళనాడు అనే ఉంది. ఈ సారి మాత్రం అది తమిజగం అయిపోయింది. పైగా ఈ ఆహ్వాన పత్రికపై తమిళనాడు ప్రభుత్వ చిహ్నం లేదు. తమిళనాడు ప్రభుత్వ చిహ్నం అంటే శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ దేవాలయం చిత్రం ఉండాలి. భారత ప్రభుత్వ చిహ్నం మాత్రం ఉంది. తమిళనాడు బదులు తమిజగం అనడం అంటే గవర్నర్ రవి ఆర్.ఎస్.ఎస్.–బీజేపీ ఎజెండాను అమలు చేయడమే. ఇది అత్యంత ప్రమాదకరమైన వైఖరి. "దేశాని కంతటికీ వర్తించేదాన్ని తమిళనాడు కాదంటుంది. అది వారికి అలవాటై పోయింది. ఇలాంటి సిద్ధాంతాలు బోలెడు వచ్చాయి. ఇవన్నీ అసత్యాలే, కట్టు కథలే. వీటిని పటాపంచెలు చేయాలి"అనేంత సాహసి గవర్నర్ రవి. ఇలాంటి గవర్నర్లు నెలకొల్పుతున్న అవాంఛిత సంప్రదాయాలు ఇలాగే కొనసాగితే గవర్నర్ల వ్యవస్థను ఎవరూ రద్దు చేయనక్కర్లేదు. ఈ అధికప్రసంగాలే ఆ వ్యవస్థ అంతరించేలా చేస్తాయి.

# బ్రెజిల్‌లో బొల్సొనరో విధ్వంసకాండ

సాత్యకీ చక్రవర్తి

బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బొల్సొనరో ప్రోద్బలంతో ఆయన అనుచరులు విధ్వంసకాండ సృష్టించారు. ఈ నెల 8వ తేదీ ఆదివారం రాత్రి అధ్యక్ష భవనం, పార్లమెంటు భవనంపై దాడిచేసి నానా బీభత్సం సృష్టించారు. గడిచిన డిసెంబర్‌లో బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో వామపక్ష నాయకుడు, రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసిన లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా గెలుపొందారు. ఆయన జనవరి 1వ తేదీన పదవీ ప్రమాణం చేశారు. పచ్చి మితవాది అయిన బొల్సొనరో ఎన్నికల్లో ఓటమిపాలై లూలా విజయాన్ని తను అంగీకరిస్తానని చెప్పినవాడు ఆ తర్వాత మాటమార్చాడు. లూలా ఎన్నికను తాను ఎంతమాత్రం అంగీకరించబోనని ప్రకటించాడు. వేలాది మంది బొల్సొనరో అనుచరులు సాగించిన విధ్వంసకాండతో తనకు సంబంధంలేదని జరగవలసినదంతా జరిగిన తర్వాత బొల్సొనరో ఒక ప్రకటన చేశాడు. రెండు కీలకమైన భవనాలపైన దాడి చేయటమే కాక సైన్యం జోక్యం చేసుకొని లూలాను అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 2021 జనవరి 6న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి పాలైన డొనాల్డ్ ట్రంప్ అనుచరులు కాపిటల్ హిల్‌పై దాడి చేసినట్టుగానే బొల్సొనరో అనుచరులు కూడా దాడిచేసి విధ్వంసం సృష్టించారు. శాంతియుతంగా ప్రజాస్వామ్యబద్ధంగా అధికారాన్ని లూలాకు అప్పగించడానికి బదులుగా బీభత్సం సృష్టించారు.

ట్రంప్ బాటలోనే బొల్సొనరో విధ్వంసానికి పూనుకుని తిరుగుబాటుకు యత్నించాడు. లాటిన్ అమెరికాలో చాలా దేశాల్లో వామపక్షవాదులు అధికారానికి వచ్చారు. పచ్చి మితవాదులు ఈ పరిణామాలను అంగీకరించ లేకపోతున్నారు. తన అనుచరులు కాపిటల్ హిల్‌పై దాడిచేసినప్పుడు ట్రంప్ హాయిగా విశ్రాంతి తీసుకున్న మాదిరిగానే బొల్సొనరో కూడా అనుచరులు రెచ్చిపోయి పార్లమెంటు, అధ్యక్ష భవనాలపై దాడిచేసినప్పుడు తన నివాసంలో కులాసాగా గడిపాడు. పైగా ప్రదర్శన చేసే హక్కు ఆందోళనకారులకు ఉంటుందని బొల్సొనరో ప్రకటించటం మితవాదుల మనోభావాలను తెలియజేస్తుంది. ముందుగా సైనిక ప్రధాన కార్యాలయం ముందు బొల్సొనరో అనుచరులంతా గుమికూడారు. లూలాను పదవి నుంచి తప్పించాలని సైనిక కార్యాలయం ముందు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యం అంటే వీరికి నచ్చదు. నియంతృత్వ పోకడలనే తమ కార్యకలాపాలలో ప్రదర్శించే బొల్సొనరో ఈసారి ఓటమి తప్పదని ఎన్నికలకు ముందే అంతా ఊహించారు. లూలాకు మరింత మెజారిటీ వస్తుందని భావించినప్పటికీ అది సాధ్యం కాలేదు. అయితే ఆయన రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసినప్పుడు అనేక ప్రజానుకూల కార్యక్రమాలను చేపట్టి మిక్కిలి ఆదరణ పొందారు. మితవాద నాయకులు తప్పుడు కేసులు బనాయించి ఆయనను జైలుపాలు చేశారు. పశ్చిమ దేశాలలో పరిపాలన చేస్తున్న నాయకులు ఎక్కువమంది ప్రజాస్వామ్య వ్యతిరేకులుగానే ఉన్నారు. ఇటలీలో మితవాద ప్రధానమంత్రి, అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ బొల్సొనరో చర్యలను తీవ్రంగా ఖండించారు.

ఒక్క బ్రెజిల్‌లోనే కాకుండా వామపక్ష నాయకులు గెలుపొందిన మరికొన్ని దేశాలలోను మితవాదులు విధ్వంసం సృష్టించటం, తిరుగుబాటుకు ప్రయత్నించటం గతంలోను, ఇప్పుడు జరిగాయి. ఈ నేపథ్యంలో లాటిన్ అమెరికాలోనే వామపక్ష ప్రభుత్వాలన్నీ లూలాకు అండగా నిలుస్తామని ప్రకటించాయి. బొల్సొనరో చర్యలను తీవ్రంగా వామపక్ష ప్రభుత్వాల నాయకులు ఖండించారు. బొల్సొనరో అనుచరులు దాడిచేసి తిరుగుబాటుకు ప్రయత్నించటం తీవ్రమైన విషయంగా వామపక్ష నాయకులు పరిగణిస్తున్నారు. బ్రిటన్ లేబర్ పార్టీలో వామపక్షవాది జెరిమికార్బిన్ బ్రెజిల్‌లో తిరుగుబాటును ఖండిస్తూ వాషింగ్టన్‌లో ట్రంప్ సృష్టించిన బీభత్స దృశ్యాలు బ్రెజిల్‌లో కళ్లకు కనిపిస్తున్నాయని అన్నారు. ఫాసిజం, నియంతృత్వం, సైనిక పాలన అన్నీ ప్రజాస్వామ్యానికి విరుద్ధమైనవని కార్బిన్ అన్నారు. ఎన్నికలకు ముందే బొల్సొనరో అనేక ప్రాంతాలలో విధ్వంసానికి అనుచరులను ప్రోత్సహించాడు. మితవాద పక్ష నాయకులంతా బొల్సొనరో గెలుపొందుతాడన్న ధీమాతోనే ఉన్నారు. అమెరికా సైతం బొల్సొనరోకు వత్తాసుగానే ఉన్నారు. లూలా సామాజిక న్యాయం, దేశ ప్రజల హక్కుల పరిరక్షణ, అడవుల నరికివేత నిరోధం లాంటి ప్రజానుకూల అంశాలను తీసుకుని ప్రచారం చేయడం ద్వారా ఎన్నికల్లో గెలుపొందారు. అయితే అధికారాన్ని చేపట్టిన వారం రోజుల్లోనే బొల్సొనరో తన నిజ స్వరూపాన్ని బయటపెట్టుకున్నాడు. లూలా పాలన ప్రారంభించి పరిస్థితులను చక్కదిద్దే లోజే మితవాద శక్తులు విజృంభించి నందున వామపక్ష నేతలు అప్రమత్తంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. లాటిన్ అమెరికాలో వామపక్ష శక్తులను బలోపేతం చేసేందుకు కూడా లూలా సిద్ధమయ్యారు.

# సబ్సిడీల కోతకు మోదీ ప్రభుత్వం రెడీ

మోదీ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఫిబ్రవరి 1 ప్రవేశ పెట్టనుంది. ఈ బడ్జెట్‌లో ఆహారం, ఎరువులకు ఇచ్చే సబ్సిడీలో 3.7 లక్షల కోట్ల మేర తగ్గించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలియచేస్తున్నాయి. ఈ తగ్గింపులు ఇంతకు ముందు బడ్జెట్ నుండే ప్రారంభమైంది. 2021-22 సంవత్సరంలో సవరించిన బడ్జెట్‌లో ఆహార సబ్సిడీ 2,86,469 కోట్లు ఉండగా, 2022-23 బడ్జెట్ లో 2,06,831 కోట్లకు తగ్గింది. ఎరువుల సబ్సిడీని 1,40,122 కోట్ల నుండి 1,05,222 కోట్లకు తగ్గించారు. ఎరువుల సబ్సిడీని తగ్గించడానికి వ్యవసాయ రసాయన ఇన్‌పుట్‌లలో వస్తువు ద్రవ్యోల్బణం పెరగటం, కొరతకు దారితీయటం, గత సంవత్సరం ఒకటి కంటే ఎక్కువ సార్లు ఎరువుల సబ్సిడీ పెంచటం వలన 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎరువుల సబ్సిడీ ఖర్చు అసలు బడ్జెట్ కేటాయింపుల నుండి సవరించిన అంచనాకు 76% కంటే ఎక్కువ పెరిగిందని ప్రభుత్వ ప్రతినిధి తెలియ చేశాడు. ఇదే ఆర్థిక సంవత్సరంలో ఆహార సబ్సిడీ 2,42,836 కోట్ల నుంచి 2,86,469 కోట్లకు పెరిగిందని, పెరిగిన ఆహార, ఎరువుల సబ్సిడీ ప్రభుత్వానికి భారం కావటం వలన 2023 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో సబ్సిడీలను తగ్గించనున్నట్లు మోదీ ప్రభుత్వ ప్రతినిధులు తెలిపారు. ఆర్థిక సంవత్సరంలో జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ)కి సబ్సిడీ కోసం సవరించిన అంచనా 2,02,616 కోట్ల నుంచి 2,10,929 కు పెరిగి, 2022-23 బడ్జెట్‌లో 1,45,919 కోట్లకు పెరిగింది.

ఆహార, ఎరువుల సబ్సిడీ పెరుగుదల, తగ్గింపు మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా చేసిందే. ఉత్తరప్రదేశ్‌తో పాటు నాలుగు రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ప్రజల వ్యతిరేకతను దారి మళ్లించే విధంగా 2021-22 బడ్జెట్‌లో ఎరువుల, ఆహార సబ్సిడీని పెంచి లబ్దిపొందింది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత 2022-23 బడ్జెట్‌లో సబ్సిడీని పెద్ద మొత్తంగా తగ్గించింది. ఇప్పుడు ఇంకొకసారి 3.7 లక్షల మేర తగ్గించేందుకు సిద్ధంగా ఉంది. మోదీ ప్రభుత్వం ఆహార, ఎరువుల సబ్సిడీయే కాకుండా అంతకుముందు అనేక సబ్సిడీలను ఎత్తి వేసింది. దేశ వ్యాప్తంగా మొత్తం 30.5 కోట్ల ఎల్‌పిజి కనెక్షన్లు ఉన్నాయి. 2014 లో వంటగ్యాస్ ధర 414 ఉంది. 2019 లో 769 రూపాయలకు పెరిగింది. ఆధార్ లింక్ చేసిన వినియోగదారులకు కొంత కాలం 260 రూపాయల సబ్సిడీ వారి ఖాతాల్లో జమ అయ్యింది. ఆ తర్వాత సబ్సిడీని రద్దు చేశామని చెప్పకుండానే దాన్ని ఆపివేసింది. 2021 జనవరిలో సిలిండర్ ధర 23 తగ్గించి సబ్సిడీని పూర్తిగా ఎత్తివేసింది. ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్ ధర 11వందల దాకా ఉంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద ఉన్న 9 కోట్ల మందికి మాత్రమే 200 రూపాయల సబ్సిడీ ఇస్తున్నది. అది కూడా త్వరలో ఎత్తి వేస్తుందనటంలో సందేహానికి ఆస్కారమే లేదు. 2010 లో యూపీఏ ప్రభుత్వం పెట్రోల్ పై సబ్సిడీ తొలగిస్తే, మోదీ ప్రభుత్వం 2014 నవంబర్‌లో డీజిల్ పై ఉన్న సబ్సిడీని తొలగించింది. ఇంతకు ముందే కిరోసిన్‌పై ఉన్న సబ్సిడీనీ తొలగించారు. రైల్వే ప్రయాణంలో వృద్ధులకు ఉన్న రాయితీని కూడా మోదీ ప్రభుత్వం రద్దు చేసింది. ఇంకా అనేక రాయితీలు తొలగించారు.

పేదలు, రైతాంగం, మధ్య తరగతి ప్రజలు రాయితీల, సంక్షేమ పథకాల కోసం పాలకుల పై ఎందుకు ఆధారపడాల్సి వస్తుంది. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి దేశాన్ని పాలించిన, పాలిస్తున్న ఏ పార్టీ పాలక ప్రభుత్వం అయినా దేశప్రజల ప్రయోజనాలు విస్మరించి, దేశ సహజ వనరులను సామ్రాజ్యవాదులకు, బహుళజాతి సంస్థలకు కట్టబెడుతూ వస్తున్నాయి. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో వాటి ప్రయోజనాలకు అనుగుణమైన విధానాలు అమలు జరుపుతున్నాయి. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ షరతులను ఆమోదించి ప్రయివేటీకరణ విధానాలతో పాటు దేశంలోకి విదేశీ పెట్టుబడులను రక్షణ రంగంతో సహా అన్ని రంగాల్లోకి మోదీ ప్రభుత్వం ఆహ్వానిస్తున్నది. కొన్ని సంస్థల్లో నూటికి నూరు శాతం విదేశీ పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ప్రపంచ వాణిజ్య ఒప్పందం పై సంతకం చేసింది. వ్యవసాయ ఒప్పందాలను ఆమోదించి బహుళజాతి సంస్థల వ్యాపారానికి ద్వారాలు బార్లా తెరిచింది. పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా దేశ సంపద సామ్రాజ్యవాదులు తరలించుకు పోవటమే కాకుండా, వారితో మిలాఖత్ అయిన బడా పెట్టుబడిదారుల వద్ద వేలు లక్షలు పోగుపడి ఉంది. వ్యవసాయ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఫలితంగా చిన్న, సన్న కారు రైతులు అప్పులపాలై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. పేదలు దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారు.

పాలకుల విధానాలకు వ్యతిరేకంగా గ్రామీణ, పట్టణ పేదలు, కార్మికులు, రైతాంగం వీధుల్లోకి వచ్చి ఉద్యమాలు ప్రారంభించారు. ఉద్యమాలకు భయపడిన పాలకులు ప్రజలకు కొన్ని రాయితీలు ప్రకటించారు. వాటిల్లో ఆహార, ఎరువుల సబ్సిడీలు ప్రధానమైనవి. వీటిని కూడా పాలక పార్టీలు స్వార్థ రాజకీయ ప్రయోజనం కోసం ఉపయోగించుకుంటున్నాయి. ప్రపంచ వాణిజ్య ఒప్పందం ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ఫైనాన్స్ పెట్టుబడి ఎగుమతి ప్రారంభమైంది. దీనికి దేశం, రాజ్యం అదుపు ఉండదు. ఏ దేశానికి అది ప్రాతినిధ్యం వహించదు. ఒక దేశ ప్రయోజనాలను నెరవేర్చేదిగా ఉండదు. స్పెక్యులేషన్ ద్వారా తక్షణ లాభాల లక్ష్యంతో పని చేస్తుంది. ఈ పెట్టుబడి త్వరగా లాభాలు సంపాయించటానికి అనేక విధాల ప్రయత్నిస్తుంది. ఫైనాన్స్ పెట్టుబడికి ప్రపంచీకరణ అనేది ఒకవైపు పెట్టుబడి కేంద్రీకరణపై ఆధారపడుతూనే, ప్రపంచీకరించబడుతుంది.

అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు, వారి రైతులకు పెద్ద ఎత్తున సబ్సిడీ ఇస్తున్నాయి. అమెరికాలో ఆహార, ఎరువుల సబ్సిడీలు ప్రభుత్వానికి భారంగా ఉందని చెబుతున్న మోదీ ప్రభుత్వం, బడా పారిశ్రామికవేత్తలకు అనేక రాయితీలు ప్రకటించటమే కాకుండా 2014-15 నుంచి 2020 సంవత్సరాల్లో బడా పారిశ్రామికవేత్తల మొండి బకాయిలు 18,28,584 కోట్ల రూపాయలు కాగా అందులో దాదాపు ఎనిమిది లక్షల కోట్ల రూపాయలను ఇప్పటికే బ్యాంకులు రద్దు చేయటం గమనిస్తే పాలకులు ఎవరి ప్రయోజనాలు కాపాడుతున్నారో వెల్లడౌతుంది. పోయిన ఆర్థిక సంవత్సరంలో కూడా లక్ష కోట్లకు పైగా పారు బాకీలు రద్దు చేశారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొండి బకాయిలు 21% పెరిగాయి. పారిశ్రామికవేత్తలకు పెద్దఎత్తున అప్పులు రద్దు చేస్తున్న మోదీ ప్రభుత్వం, రైతులకు ఎరువులపై ఇస్తున్న సబ్సిడీని భారంగా భావించటం దాని రైతాంగ వ్యతిరేక విధానాలకు నిదర్శనం.

బొల్లిముంత సాంబశివరావు, సెల్: 9885983526

## కుంగిపోతున్న జోషిమఠ్

ఇ-మెయిల్

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో బద్రీనాథ్‌కి దగ్గరలో ఉన్న జోషిమఠ్ పట్టణం పూర్తిగా మట్టిలోకి కుంగిపోతున్నదన్న వార్త ఆందోళనకరం. ఆ చారిత్రాత్మక పట్టణంలో రోడ్లు, ఇళ్ళు పగుళ్ళుబారడం అక్కడి నుండి వందలాది కుటుంబాల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి రావడం బాధాకరం. ప్రధాని, అక్కడి ముఖ్యమంత్రి విపత్తు సహాయక చర్యల్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

అయితే 17వేల మంది జనాభా కల ఆ పట్టణానికి ఈ ఉపద్రవం హఠాత్తుగా వచ్చిపడలేదు. ఏభై ఏళ్ల క్రితం ఒక కమిషన్ ఆ ప్రాంతానికి రాగల ప్రమాదంగురించి ముందే హెచ్చరించింది. హిమాలయాలకు దగ్గరలో ఉన్న ఆ పర్వత ప్రాంతపు నేల స్వభావాన్ని బట్టీ అక్కడ స్వభావసిద్ధంగా ఉన్న బండరాళ్లను తొలగించరాదని, మొక్కల్ని ఎక్కువగా పెంచాలని చెప్పింది. పన్నెండేళ్ల క్రితం జియాలజిస్టులు కూడా నూతన నిర్మాణాల విషయమై సూచనలు చేసింది. అయితే పర్యావరణ సమతుల్యత సంబంధిత జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు, ప్రజలు తేలిగ్గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఇప్పుడా సమస్య ముదిరి మరింత ప్రమాదకరంగా తయారైంది. ఊరుకి ఊరే కట్టుబట్టలతో ఖాళీ చెయ్యాల్సిన పరిస్థితి దాపురించింది. ఊరంతా రోడ్లు, ఇళ్ళు కుంగడానికి ఇప్పుడొచ్చిన పర్యావరణ మార్పు ఏదైనప్పటికీ, పరిస్థితి తెలిసి ఇంతదాకా దిగజారడానికి మాత్రం తప్పు ప్రజలదీ ..పాలకులదీ. అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా ఉల్లంఘనలకు పాల్పడితే, పర్యవసానాలు ప్రమాదకరంగానే తయారౌతాయి. ఆ పట్టణం ఇందుకు ఉదాహరణ. ప్రకృతిని గౌరవించేలా సమాజం వ్యవహరించకపోతే ఇటువంటి ప్రమాదాలు నిత్యకృత్యమౌతాయి. అమెరికా, చైనాల్లో కరవులు, మనదేశంలో వరుసగా వరదలు ఇలా ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాలు, అకాలవరదలు, కరవులు, తీవ్రఉష్ణోగ్రతలు పెరగడం లాంటివి ఎక్కువవుతున్నాయి. పర్యావరణం కాపాడుకోవడానికి కూడా ఉమ్మడిగళం కరవౌతుంది. ధనిక,పేద దేశాల నడుమ భిన్నాభిప్రాయాలు నెల కొంటున్నాయి. ఈ స్థితి మారాలి. పర్యావరణ స్పృహ, బాధ్యత వ్యక్తి నుండి వ్యవస్థ దాకా పొరుడి నుండి, ప్రపంచ దేశాధినేత దాకా అలవర్చుకోవాల్సిన అవసరం ఉంది. జోషిమఠ్ ఉదంతం ఇదే చెప్తోంది.

డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, 9440836931

# న్యాయ నియామకాల్లో కొలీజియం సరైందేనా?

చెరుకూరి సత్యనారాయణ

సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల్ని ప్రతిపాదిస్తున్న భారత ప్రధాన న్యాయమూర్తి సారధ్యంలో మరో నలుగురు సుప్రీం సీనియర్ న్యాయమూర్తుల సారధ్యంలోని కొలీజియం వ్యవస్థపై ఇటీవల చాలా చర్చ నడిచింది. న్యాయ మూర్తులే న్యాయమూర్తుల్ని నియమించుకోవటం ఏమిటని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించగా దీనికి ప్రత్యామ్నాయం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. మరో సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న సుప్రీంకోర్టు చూస్తూ ఊరుకోవాలా? అని సీరియస్‌గా వ్యాఖ్యానించారు. దీనికంటే ప్రజాస్వామికమైన పద్ధతి లేదని గత సి.జే.ఐ. జస్టిస్ రమణ అప్పుడే చెప్పారు. కొలీజియం పద్ధతి రాజ్యాంగబద్ధం కాదని కొందరు న్యాయమూర్తుల నిర్ణయం దేశం మొత్తానికి ఎలా ఆమోదయోగ్యమవుతుందని రిజిజు ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు సవాల్ విసరటం సరికాదని మాజీ న్యాయశాఖామంత్రి వీరప్ప మొయిలి కొలిజయంను సమర్థించారు. కొలిజియం తన సామర్థ్యాన్ని నిరూపించుకుందని ఆయన కొనియాడారు. పార్లమెంటు కంటే ఎవరు సుప్రీం? అని ఉపరాష్ట్రపతి జగదీష్ ధనకడ్ సి.జె.ఐ.సమక్షంలోనే ఎల్.ఎం.సింఘ్వీ స్మారక సభలో డిసెంబర్ 2న ఘాటుగా వ్యాఖ్యానించారు.

ఈ చర్యల, వ్యాఖ్యానాల రచ్చలో న్యాయమూర్తుల నియామకానికి సరైన పద్ధతి ఏది? అని ఎంచుకునే ముందు పాఠకులు దీని పూర్వాపరాలు కొంచెం తెల్సుకోవాలి. 1950 జనవరి 26 న అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగంలో 4వ అధ్యాయంలో పూర్తిగా (124 నుండి 147 అధికరణాలు) సుప్రీంకోర్టు ఏర్పాటు, న్యాయమూర్తుల నియామకం, విధులు, తొలగింపులు అన్నింటి గురించి విపులంగా రాశారు. దాని ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్ని రాష్ట్రపతి నియమిస్తారు. అంటే కేంద్ర ప్రభుత్వం అని వేరే చెప్పేదేముంది. "తాను ఉచితమని భావించినట్లయితే న్యాయమూర్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవచ్చు" (124(2)). ప్రధాన న్యాయమూర్తి మినహా మిగిలిన న్యాయమూర్తుల నియామకంలో ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి తీరాలి. దీని ద్వారా మనకర్థమయ్యే విషయం ఏమిటి? "ఉచితమని భావిస్తే", పరిగణలోనికి తీసుకోవచ్చు, "సంప్రదించి తీరాలి". ఈ పదాల్లో ఎక్కడా సుప్రీంకోర్టు నిర్ణయాధికారం లేదు. అంతా రాష్ట్రపతిదే. 1993 వరకు 43 సంవత్సరాలు ఇలాగే జరిగింది. ప్రభుత్వమే సుప్రీం అనుకున్న రోజుల్లో కూడా న్యాయశాస్త్ర నిష్ణాతులు, గొప్ప నిజాయితీపరులు, ధైర్యవంతులు అయిన న్యాయమూర్తుల సంఖ్యే అధికంగా వుంది. మధ్యలో ఇందిరాగాంధీ హయాంలో మినహా ఎప్పుడూ సాంప్రదాయ ఉల్లంఘనలు, స్వామిభక్తుల నియామకాలు జరగలేదు. అప్పట్లో కార్య నిర్వాహక వ్యవస్థ ఇప్పటిలా దిగజారలేదు. కక్ష సాధింపులు, న్యాయవ్యవస్థ పూర్తిగా తమ చెప్పుచేతల్లో వుండాలనే ధోరణి తక్కువగా వుండి న్యాయవ్యవస్థలో సాంప్రదాయ ప్రమాణాలు కాపాడారు. కింద

కోర్టుల్లో న్యాయమూర్తుల నియామకాలు హైకోర్టుల చేతుల్లో వున్న రోజుల్లోనే ముఖ్యమంత్రుల అభిమతాలకనుగుణంగా కొందరు జిల్లా జడ్జీలు నియమితులైన చరిత్ర మన ఉమ్మడి రాష్ట్రంలో జరిగింది. కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా వున్న రోజుల్లో మంత్రివర్గంలో స్థానం కల్పించలేని శాసనసభ సభ్యులుగా వున్న పున్నయ్య (శ్రీకాకుళం) ఎ.డి.వి.రెడ్డి (తూర్పు గోదావరి)లకు జిల్లా జడ్జి పదవులివ్వటం తర్వాత వారు హైకోర్టు న్యాయమూర్తు లవ్వటం జరిగింది. జస్టిస్ చల్లా కొండయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. ఒక కేసులో ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు చెప్పమని అడిగినట్లు దానికి ప్రతిగా ఆయన కుమారుడికి ప్రభుత్వ అధికారిగా ఉద్యోగం ఇస్తానని అన్నట్లు 1993 లో ఇద్దరు లాయర్లతో పాటు ఆయనను కలిసినప్పుడు చెప్పారు. ఈ రెండు ఉదంతాలు ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే న్యాయ వ్యవస్థకు కార్య నిర్వాహక వ్యవస్థకు ఆ రోజుల్లో లావాదేవీలున్నాయని చెప్పటానికే. మొత్తానికి రాజ్యాంగంలో కార్యనిర్వాహక వ్యవస్థకున్న అధికారాల్ని కేవలం తీర్పుల ద్వారా తమకు దఖలు పరుచుకోవటంలో సుప్రీంకోర్టు సఫలమైంది. ప్రభుత్వం 99వ రాజ్యాంగ సవరణ ద్వారా న్యాయమూర్తుల నియామకానికి 'జాతీయ న్యాయ మూర్తుల నియామక కమీషన్' ఏర్పాటును ప్రతిపాదించగా సుప్రీంకోర్టు దాన్ని కొట్టివేసి కొలీజియం వ్యవస్థని ఏర్పాటు చేసి న్యాయమూర్తుల్ని సిఫారసు చేసే అధికారాన్ని తనకితానే దఖలు పరుచుకుంది. ఈ తీర్పు త్రీ జడ్జెస్ కేసు అంటారు. కొలీజియం అనే పదమే ఒక విచిత్రమైంది ఔత్సాహిక సంగీతకారుల సంఘాల్ని జర్మనీ, అమెరికాల్లో కొలీజియం అంటారు. రష్యాలో కొలీజియం అంటే సలహా సంఘం.

కొలీజియం పంపిన జాబితా ఒకసారి ప్రభుత్వం తిరిగి పంపితే మళ్లీ సుప్రీంకోర్టు అదే జాబితా పంపితే దాన్ని ఆమోదించాలని సుప్రీం అంటుంది. కాని ఈ సంవత్సరంలో రెండుసార్లుగా 21 మంది న్యాయమూర్తుల జాబితాల్ని పంపితే ఇద్దర్ని మాత్రం ఆమోదించి 19 మంది జాబితా వెనక్కు పంపారు. ఇందులో 10 మంది మొదటి జాబితా రెండోసారి కూడా తిప్పిపంపారు. గుజరాత్‌కు చెందిన అఖిల్ అబ్దుల్ ఖురేషి రాజస్థాన్ త్రిపుర హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి సుప్రీం న్యాయమూర్తిగా కొలీజియం సిఫార్సు చేసినా పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ చేశారు. మోదీ ముఖ్యమంత్రిగా వున్న కాలంలో ఆయన అభిమతానికి వ్యతిరేకంగా నియమితులైన లోకాయుక్త మెహతాకు అనుకూలంగా తీర్పు చెప్పటం, అలాగే ఆనాడు గుజరాత్ హోం మంత్రిగా వున్న ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను సి.బి.ఐ కస్టడీకి అప్పగిస్తూ తీర్పు చెప్పటం నేరంగా భావించారు. ఇంకా అనేకమంది నిజాయితీ కల్గిన న్యాయమూర్తులకు ఇలాంటి పరిస్థితే దాపురించింది. వారి పేర్లను మళ్లీ మళ్లీ పంపే ధైర్యం గొప్ప గొప్ప న్యాయమూర్తులే చెయ్యకపోవటం గమనార్హం. ఆనాటి ఇందిరాగాంధి, ఈనాటి నరేంద్రమోదీల ప్రభుత్వాల వ్యవహార సరళి న్యాయమూర్తుల నియామకాలు, పదోన్నతుల అధికారం ఎవరి చేతుల్లో వున్నా కార్యనిర్వాహక వ్యవస్థమాటే చెల్లుబాటు అయ్యేలా చూసుకుంటున్నారు. ఉన్నత న్యాయస్థానాల్లో ప్రధానకక్షిదారు ప్రభుత్వమే అని అందరికీ తెల్సు. జడ్జీలే జడ్జీలను నియమించుకోవటం ఏమిటని ప్రశ్నిస్తున్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మరి కక్షిదారే న్యాయమూర్తుని నియమించుకోవటం ఏమిటనే దానికి ఏమి చెబుతారు. దేశంలో అన్ని వ్యవస్థలూ చెడిపోయినంతగా పబ్లిక్ సర్వీస్ కమీషన్ చెడిపోలేదు. ఐ.ఎ.యస్, ఐ.పి.యస్ అధికారుల ఎన్నిక ఎంత పకడ్బందీగా జరుగుతుందో అందరికీ తెల్సు. అభ్యర్థుల వడపోత, నైపుణ్యాల వెలికితీత చాలా పారదర్శకంగా వుంటాయని అందరూ అంగీకరిస్తారు. న్యాయపాలనలో అతిచిన్న మున్సిఫ్ మేజిస్ట్రేట్ పదవికి సైతం పరీక్ష, ఇంటర్వ్యూలు వుండగా మరి ఉన్నత న్యాయ స్థానాల్లో ఏ గీటురాయి లేకుండా ప్రధాన న్యాయమూర్తుల "గుడ్లుక్స్" లో వుంటే చాలు న్యాయమూర్తులుగా నియమించటం న్యాయమా? న్యాయ, కార్య నిర్వాహక వ్యవస్థలు సమన్వయంతో చర్చించి ఇప్పటికైనా ఒక శాస్త్రీయమైన పద్ధతిలో న్యాయమూర్తుల నియామకం చేపడితే ప్రజల దృష్టిలో దాని ఔన్నత్యం నిలుస్తుంది.

# మరో వివాదంలో గవర్నర్ రవి

## 'పొంగల్' వేడుకలకు ఆహ్వాన పత్రిక
## దానిపై కనిపించని రాష్ట్ర చిహ్నం
## డీఎంకే ప్రభుత్వం ఆగ్రహం

**చెన్నై :** తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి మరో వివాదానికి ఆజ్యం పోశారు. రాజ్ భవన్‌లోని పొంగల్ వేడుకల ఆహ్వాన పత్రికపై రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం లేదన్న ఆరోపణలపై మరో వివాదం చెలరేగింది. రాజ్ భవన్‌లో జరిగే సంక్రాంతి వేడుకలకు హాజరవ్వాలంటూ రాష్ట్ర ఎమ్మెల్యేలకు ఆహ్వాన పత్రిక పంపారు. అయితే తమిళనాడు ప్రభుత్వం బదులుగా 'తమిళగం అజునర్' అని ఆహ్వాన పత్రికలో పేర్కొనడంపై రాష్ట్ర ప్రభుత్వం మండిపడుతోంది. గవర్నర్ ఆహ్వాన పత్రికలో రాష్ట్ర ప్రభుత్వ చిహ్నానికి బదులుగా కేంద్ర ప్రభుత్వ చిహ్నం ఉండటం గమనార్హం. ఆంగ్ల వెర్షన్‌లో రాష్ట్ర గవర్నర్ పేరు రాశారు. తమిళనాడుని తమిళగం అంటూ గతంలో వ్యాఖ్యానించడంపై వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. తమిళనాడు అసెంబ్లీని ఉద్దేశించి తొలిరోజు చేసే ప్రసంగంలో 'అంబేద్కర్, ద్రవిడ నేతలు, ద్రవిడ పాలన'ను గవర్నర్ ప్రస్తావించకపోవడం వివాదానికి దారి తీసింది.

**గవర్నర్ ప్రసంగాన్ని నిరసిస్తూ 'గెటౌట్‌రవి' పోస్టర్లు**

తమిళనాడులో రాజ్‌భవన్-ప్రభుత్వం మధ్య వివాదం మరింతగా ముదిరింది. రాష్ట్ర అసెంబ్లీలో అధికార డీఎంకే ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్.ఎన్.రవి మధ్య వాగ్వాదం జరిగిన ఒక రోజు తర్వాత, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రముఖంగా ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ చిత్రంతో ఉన్న 'గెటౌట్‌రవి' పోస్టర్లు కనిపించాయి. అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వంతో రవి ముఖాముఖి సోమవారం ట్విట్టర్‌లో ట్రెండింగ్‌లో ఉంది. సోమవారం అసెంబ్లీలో గవర్నర్ రవి ప్రసంగం వేళ నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అక్కడ అధికార డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ కూడా గవర్నర్ శాసనసభలో తన సంప్రదాయ ప్రసంగం నుంచి వైదొలగడాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని ప్రయోగించారు. అయితే ప్రభుత్వం తాను రూపొందించిన ముసాయిదాను తనవద్దే ఉంచుకుంది. ఈ క్రమంలోనే జాతీయ గీతం వినిపించకముందే... గవర్నర్ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. అయితే తాజాగా గవర్నర్ రవికి వ్యతిరేకంగా పశ్చిమ చెన్నైలోని వల్లువర్ కొట్టం, అన్నాసాలై ప్రాంతాల్లో 'గెటౌట్ రవి' అని ఉన్న పోస్టర్లు కనిపించాయి. కోయంబత్తూరులో గవర్నర్‌కు వ్యతిరేకంగా తంథై పెరియార్ ద్రవిడర్ కజగం అధ్వర్యంలో నిరసనలు జరిగాయి. అక్కడ ఆందోళనకారులు రవి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించారు. ఈ ఘటనను ఖండిస్తూ మరో చోట స్థానిక బీజేపీ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. పోలీసులు ఆయా కార్యకర్తలను వేర్వేరుగా అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు పుదుకొట్టైలో గవర్నర్ రవిని అభినందిస్తూ స్థానిక బీజేపీ కార్యకర్తలు పోస్టర్లు వేశారు. బీజేపీకి మద్దతుగా ఉండే ట్విట్టర్ హ్యాండిల్స్ కూడా గవర్నర్‌కు మద్దతుగా నిలుస్తున్నాయి. అధికార డీఎంకేపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి అసెంబ్లీలో సోమవారం చోటుచేసుకున్న పరిణామాలపై స్పందిస్తూ... సభ చరిత్రలో ఇది అపూర్వమైన సంఘటన అని అన్నారు. 'సాధారణంగా మా నాయకుడు (స్టాలిన్) తన ప్రత్యుత్తరాలతో అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని పరిగెత్తించేలా చేస్తారు. కానీ ఈసారి గవర్నర్‌ను పరుగెత్తేలా చేశారు. మన హక్కులు దెబ్బతిన్నప్పుడల్లా ఆందోళన వ్యక్తం చేసే మొదటి ముఖ్యమంత్రి స్టాలిన్' అని ఉదయనిధి అన్నారు. ఇదిలాఉండగా, అధికార డీఎంకేకు చెందిన కొందరు ఎమ్మెల్యేలపై టీఎన్ బీజేపీ సీనియర్ కార్యకర్త ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక ట్వీట్‌లో, రాష్ట్ర కార్యదర్శి ఎ.అశ్వథామన్... ఐపీసీలో సెక్షన్ 124 కింద తాను ఫిర్యాదు చేశానని, 'ఇది రాష్ట్రపతి, గవర్నర్ మొదలైనవారిపై దాడి చేయడం, ఏదైనా చట్టబద్ధమైన అధికారాన్ని బలవంతం చేయడం లేదా నిరోధించే ఉద్దేశంతో వ్యవహరిస్తుంది' అని తెలిపారు.

## ఆర్మీ అధికారి కారు దగ్ధం కేసులో హోటల్‌కు సీలు

**లక్నో:** ఆర్మీ మేజర్ కారును కొందరు దుండగులు తగులబెట్టిన ఘటనకు సంబంధించి లక్నో డెవలప్‌మెంట్ అథారిటీ మంగళవారం గోమతీనగర్‌లోని ఓ హోటల్‌కు సీలు వేసింది. ఈ విషయమై అథారిటీ జోనల్ ఆఫీసర్ అరుణ్ కుమార్ సింగ్ పీటీఐతో మాట్లాడుతూ, 'డెవలప్‌మెంట్ అథారిటీ బృందం దర్యాప్తు చేయడానికి వెళ్లినప్పుడు, హోటల్ ద్వారా నివాస ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలు జరుగుతున్నట్లు తేలింది' అని చెప్పారు. నిర్వాహకులు హోటల్ మ్యాప్‌ను అందించలేకపోయారని సింగ్ తెలిపారు. హోటల్‌లో అక్రమ నిర్మాణాలు కూడా జరిగాయని పేర్కొన్నారు. దీంతో హోటల్ మిలానో అండ్ కేఫ్‌కు సీలు వేసి నిర్వాహకులకు షోకాజ్ నోటీసు అందించినట్లు చెప్పారు. కాగా గోమతీనగర్ విశాల్ ఖండ్ ప్రాంతంలోని మిలానో కేఫ్‌లో పెద్ద శబ్దంతో సంగీతాన్ని వినిపించడంపై తాను అభ్యంతరం చెప్పడంతో ఆర్మీ మేజర్ కారును కొందరు వ్యక్తులు తగులబెట్టారని తొలుత పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేశామని, ఆరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. హోటల్‌లోని ఇద్దరు సిబ్బందితో పాటు మరో నలుగురు వ్యక్తులపై గోమతీనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు అదనపు డీసీపీ (ఈస్ట్) అలీ అబ్బాస్ పేర్కొన్నారు. మిలానో కేఫ్ మేజర్ అభిజిత్ సింగ్ నివాసానికి సమీపంలో ఉంది. ఆదివారం అర్ధరాత్రి డీజే జోరుగా ప్లే అవుతుండగా, ఆర్మీ అధికారి హోటల్ సిబ్బందిని సంగీతాన్ని ఆపాలని కోరగా, వారు నిరాకరించడంతో వాగ్వాదం జరిగింది. అనంతరం పోలీసుల జోక్యంతో సంగీతాన్ని నిలిపివేశారు. అయితే సోమవారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో తన ఇంటి ఆవరణలో ఉన్న కారును కొందరు యువకులు తగులబెట్టారని, మంటలను ఆర్పే సమయానికి కారు పూర్తిగా దగ్ధమైందని ఆర్మీ అధికారి ఫిర్యాదు చేశారు.

## 2009 చోరీ కేసులో కేంద్ర మంత్రి నిసిత్ ప్రమాణిక్ కోర్టుకు హాజరు

**అలీపుర్దూర్ :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ 2009లో నిందితుడిగా ఉన్న దొంగతనం కేసులో వ్యక్తిగతంగా హాజరు కావడానికి కలకత్తా హైకోర్టు ఇచ్చిన గడువుకు రెండు రోజుల ముందు మంగళవారం అలీపుర్దూర్ కోర్టుకు హాజరయ్యారు. అలీపుర్దూర్ కోర్టు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ మౌమితా మల్లిక్ ఈ కేసుపై కోర్టులో భవిష్యత్తులో జరిగే సిట్టింగ్‌లలో వ్యక్తిగతంగా హాజరుకావడాన్ని తిరస్కరించారు. 2009లో రెండు దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారనే ఆరోపణలపై 2022 నవంబర్ 16న కూచ్‌బెహార్ ఎంపీ ప్రమాణిక్‌పై అలీపుర్దూర్ కోర్టు ఆయనకు అరెస్టు వారెంట్ జారీ చేసింది. అయితే, కలకత్తా హైకోర్టు నవంబరు 23న మంత్రికి వ్యతిరేకంగా వారెంట్‌ను నిలిపివేసింది. జనవరి 7, జనవరి 12, 2023 మధ్య అలీపుర్దూర్ కోర్టులో మేజిస్ట్రేట్ ముందు హాజరు కావాలని ఆదేశించింది. అలీపుర్దూర్ పోలీస్ స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులపై దొంగతనం కేసు నమోదయిందని, అయితే ఆయనను పోలీసులు తప్పుగా ఇరికించారని ప్రామాణిక్ తరపు న్యాయవాదులు పేర్కొన్నారు.

### జోషిమఠ్‌పై అత్యవసర విచారణ అక్కర్లేదు
## 16న విచారిస్తాం: సుప్రీం

**న్యూఢిల్లీ:** ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ కుంగిపోతుండటంతో దానిని జాతీయ విపత్తుగా ప్రకటించడంలో కోర్టు జోక్యాన్ని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇటువంటి సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వ్యవస్థలు ఉన్నాయని తెలిపింది. కీలక అంశాలన్నీ తామే విచారించి పరిష్కరించాల్సిన అవసరం లేదని పేర్కొంది. జోషిమఠ్ అంశంపై స్వామి అవిముక్తేశ్వరానంద్ సరస్వతి పిటిషన్‌ను ఈనెల 16న విచారిస్తామని సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా ధర్మాసనం వెల్లడించింది. స్వామి తరపు న్యాయవాది పరమేశ్వర్‌నాథ్ మిశ్రా వాదనలు వినిపించారు. బుధవారం ఈ కేసును విచారించాలని కోరారు. దీనిపై స్పందించిన సీజేఐ 'ప్రతీది మా వద్దకే రావాలనేమీ లేదు. ఇందుకోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వ్యవస్థలు ఉన్నాయి. ఇటువంటివాటిని అవి పరిష్కరించగలవు. ఈ కేసును 16న విచారిస్తాం' అని అన్నారు.

# విదేశీ నేతల కోలాహలం

- గణతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా ఈజిప్టు అధ్యక్షుడు
- వచ్చే రెండు నెలల్లో ఆస్ట్రేలియా, జర్మనీ నేతలు సందర్శించే అవకాశం
- వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకార విస్తరణ పైనే దృష్టి

**న్యూఢిల్లీ :** ఆహారం, ఇంధన భద్రతపై ఉక్రెయిన్ వివాదానికి సంబంధించిన ప్రతికూల ప్రభావంపై అంతర్జాతీయ ఆందోళనల నడుమ వచ్చే రెండు నెలల్లో ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, జర్మనీ చాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ సహా ప్రముఖ విదేశీ నాయకులు దేశాన్ని సందర్శించవచ్చని భారత్ భావిస్తోంది. ప్రజల మధ్య పరస్పర సహకారం, ఆరోగ్య రక్షణ, రక్షణ ఉత్పత్తి, సాంకేతికత, వాణిజ్యం, ఇంధన రంగాల్లో ద్వైపాక్షిక సహకార విస్తరణపై ఈ నాయకుల పర్యటన ప్రధానంగా దృష్టి సారించవచ్చని అంచనా వేస్తున్నట్లు సందర్శనల సన్నాహాలను చూస్తున్న వారు తెలిపారు. ఈ సందర్భంగా చర్చలలో ముందుగా ఉక్రెయిన్ సంఘర్షణ, ఆహారం, ఇంధన భద్రతతో సహా దాని ప్రపంచపరమైన చిక్కులు ఉంటాయని వివరించారు. అయితే చాన్సలర్ స్కోల్జ్ వచ్చే నెల తర్వాత భారత్‌కు రావచ్చని, అలాగే అల్బనీస్ మార్చి నెల ప్రారంభంలో దేశాన్ని సందర్శించవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. కాగా, ఫ్రాన్స్ మార్చి మొదటి వారంలో మాక్రాన్ సందర్శనను పరిశీలిస్తుంది. అయితే ఇంకా నిర్ధారణ కాలేదు. అంతకన్నా ముందు లేదా వెనక్కు ఉండవచ్చునని వారు తెలిపారు. గణతంత్ర దిన వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేయడానికి ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా ఎల్-సిసి ఈ నెలాఖరులో భారత్‌లో పర్యటించనున్నారు. మార్చి 1, 2 తేదీలలో జరిగే శక్తివంతమైన సమూహం విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరయ్యేందుకు జి-20 దేశాల విదేశాంగ మంత్రులు కూడా న్యూఢిల్లీకి రానున్నారు. మార్చి 2 నుంచి 4 వరకు జరగనున్న 'రైసినా డైలాగ్'కి హాజరు కావడానికి అనేక మంది విదేశీ నేతలు కూడా భారతదేశాన్ని సందర్శిస్తారు. ఇది భౌగోళిక రాజకీయాలు, భౌగోళిక ఆర్థిక శాస్త్రంపై భారతదేశం ప్రధాన సమావేశం. ప్రచండ అని పిలువబడే నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ కూడా మరికొద్ది నెలల్లో భారత్‌లో పర్యటించే అవకాశం ఉంది. సౌదీ క్రౌన్ ప్రిన్స్, ప్రధాన మంత్రి మహ్మద్ బిన్ సల్మాన్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్ సౌద్ న్యూఢిల్లీకి ద్వైపాక్షిక పర్యటనను కూడా భారతదేశం, సౌదీ అరేబియా అధికారులు పరిశీలిస్తున్నారు. జర్మనీ చాన్సలర్ స్కోల్జ్ ప్రతిపాదిత భారతదేశ పర్యటన గురించి మాట్లాడుతూ వాణిజ్యం, రక్షణ, స్వచ్ఛమైన ఇంధనం, వాతావరణ మార్పు రంగాలలో సహకారాన్ని పెంపొందించుకోవడంలో రెండు పక్షాలు ఆసక్తిగా ఉన్నాయని చెప్పారు. నవంబరు 16న ఇండోనేషియా రిసార్టు నగరం బాలిలో జి-20 సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ఛాన్సలర్ స్కోల్జ్ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. మోదీ, అల్బనీస్ మధ్య చర్చల అజెండాలో వాణిజ్యం, సముద్ర భద్రతా సహకారాన్ని పెంపొందించడం ఎక్కువగా ఉంటుందని దౌత్య వర్గాలు తెలిపాయి. గత మేలో అత్యున్నత పదవిని చేపట్టిన తర్వాత ఆస్ట్రేలియా అధినేత భారత్‌కు రావడం ఇదే తొలిసారి. గత కొన్నేళ్లుగా భారత్-ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు పుంజుకుంటున్నాయి.

భారతదేశం-ఆస్ట్రేలియా ఆర్థిక సహకారం, వాణిజ్య ఒప్పందం (ఈసీటీఏ) గత నెలలో అమలులోకి వచ్చింది. ఇది రెండు రెండు-మార్గం వాణిజ్యాన్ని గణనీయంగా విస్తరించడానికి దోహదపడుతుందని భావిస్తున్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ భారతదేశ పర్యటన సందర్భంగా మొత్తం రక్షణ, వ్యూహాత్మక సహకారాన్ని విస్తరించడం అజెండాలో ఎక్కువగా ఉంటుంది. భారత నౌకాదళానికి 26 డెక్ ఆధారిత జెట్‌లను సరఫరా చేయడానికి బహుళ-బిలియన్ డాలర్ల ఒప్పందంలో ఫ్రెంచ్ యుద్ధ విమానం రాఫెల్... అమెరికన్ ఎఫ్ఏ-18 సూపర్ హార్నెట్ కంటే ముందుంది. మాక్రాన్ పర్యటన సందర్భంగా రాఫెల్ జెట్ సముద్ర శ్రేణి కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నట్లు భారతదేశం ప్రకటించవచ్చని ఊహాగానాలు ఉన్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. మాక్రాన్ పర్యటన కోసం సన్నాహాలు చేయడానికి ఫ్రాన్స్ అధ్యక్షుడి దౌత్య సలహాదారు ఇమ్మాన్యుయేల్ బోన్ గత వారం భారతదేశాన్ని సందర్శించారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో బోన్ విస్తృత చర్చలు జరిపారు. అలాగే మోదీని, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, భారతదేశం జి-20 షెర్పా అమితాబ్ కాంత్‌ను కూడా కలిశారు.

### గాలి జనార్ధన్ ఆస్తుల అటాచ్‌లో జాప్యంపై
## రెండ్రోజుల్లో వివరాలివ్వండి
### కర్ణాటక ప్రభుత్వానికి హైకోర్టు సూచన

**బెంగళూరు:** బళ్లారి అక్రమ మైనింగ్ కేసులో మాజీమంత్రి గాలి జనార్ధన్ రెడ్డి ఆస్తులు అటాచ్ చేసేందుకు సీబీఐకి అనుమతులివ్వడంలో జ్యాప్యానికిగల కారణాలు తెలిపేందుకు కర్ణాటక ప్రభుత్వానికి మరో రెండు రోజుల గడవును రాష్ట్ర హైకోర్టు మంజూరు చేసింది. గతంలో రూ.64కోట్ల విలువ చేసే ఆస్తులను జప్తు చేయగా రూ.19కోట్ల ఆస్తులను అటాచ్ చేసేందుకు అనుమతులు సకాలంలో ఎందుకు జారీచేయలేదని ప్రభుత్వాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. బళ్లారి అక్రమ మైనింగ్ కేసులో రెడ్డి ఆస్తుల అటాచ్‌కు ప్రభుత్వ అంగీకారం కోసం కోర్టును సీబీఐ ఆశ్రయించింది. ఇందుకు సంబంధించిన సీబీఐ చేసిన ఫిర్యాదు 2022 ఆగస్టు నుంచి రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. రెడ్డి, ఆయన భార్య, ఆంధ్రా, తెలంగాణలోని వారి కంపెనీలకు చెందిన మరిన్ని ఆస్తులనూ సీబీఐ గుర్తించింది. 2013 నుంచి ప్రత్యేక కోర్టు ఎదుట పెండింగ్‌లో ఉన్న ఈ కేసులో ఆ ఆస్తులను అటాచ్ చేసేందుకు అనుమతులు కోరింది.ఓబుళాపురం మైనింగ్ కంపెనీతో పాటు అనుబంధ మైనింగ్ కంపెనీ లిమిటెడ్ ద్వారా అక్రమ మైనింగ్‌తో ఆర్జించిన దాంతో దక్కించుకున్న ఆస్తులను విక్రయించే ప్రయత్నాల్లో రెడ్డి ఉన్నట్లు సీబీఐ వెల్లడించింది. కాగా రెడ్డి తిరిగి రాజకీయాల్లో అడుగపెట్టారు. గతేడాది డిసెంబరు 25న కల్యాణ రాజ్య ప్రగతిపక్ష పార్టీనీ ప్రకటించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కొప్పల్ జిల్లాలోని గంగావతి నుంచి పోటీ చేయనున్నట్లు వెల్లడించారు.

## యూపీ గ్రామంలో ఆవు కళేబరాలు లభ్యం

**బుదౌన్:** ఉత్తరప్రదేశ్ బుదౌన్ జిల్లాలోని ఓ గ్రామంలో పొలంలో మూడు ఆవు కళేబరాలు కనిపించడంతో ఉద్రిక్తత నెలకొంది. కేశవ్‌పూర్ కాలా గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు ఆవులను వధించారని డేటాగంజ్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ షౌరభ్ సింగ్ మంగళవారం తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆవుల తలలు, కాళ్లు, చర్మంతో పాటు ఇతర అవశేషాలను గుర్తించారు.

గ్రామపెద్ద ఇచ్చిన ఫిర్యాదు మేరకు జంతువులపై క్రూరత్వ నిరోధక చట్టం, ఉత్తరప్రదేశ్ గోహత్య నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపామని సింగ్ పేర్కొన్నారు.

# ఉత్తరాది గజగజ

### కప్పేసిన మంచుదుప్పటి - కానరాని మార్గాలు
### ఐదున్నర గంటలు ఆలస్యంగా నడిచిన 39 రైళ్లు

**న్యూఢిల్లీ:** ఉత్తర భారతాన్ని మంచు దుప్పటి కప్పేసింది. దట్టమైన పొగమంచు కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. 50మీటర్లకు మించి కనిపించని పరిస్థితులు నెలకొన్నట్లు వాతావరణ అధికారులు తెలిపారు. ఇదే కారణంగా 39 రైళ్లు ఐదున్నర గంటలు ఆలశ్యంగా నడిచినట్లు నార్తరన్ రైల్వే అధికారులు తెలిపారు. పెరుగుతున్న చలితో ఉత్తరాది గడ్డకట్టుకుపోతోంది. అతిశీల ఉష్ణోగ్రతలు- పవనాలతో మంగళవారం జమ్ముకశ్మీర్‌లో మైనస్ 0.8 డిగ్రీ సెల్సియస్ నమోదైంది. సోమవారం రాత్రి శ్రీనగర్‌లో 1.8 డిగ్రీలు నమోదు కాగా అంతకుముందు రాత్రి 0.9 డిగ్రీలు నమోదైందని అధికారులు తెలిపారు. ఖాజీగుండ్‌లో మైనస్ 0.8 డిగ్రీలు, కోకెనాగ్‌లో మైనస్ 3.6 డిగ్రీలు, కుప్వారాలో 2.7 డిగ్రీలు, పహల్గామ్‌లో మైనస్ 3.2 డిగ్రీలు నమోదైనట్లు వెల్లడించారు. లోయ ప్రాంతంలోని వాతావరణ కేంద్రాల్లో పది డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. చాలా చోట్ల హిమాపాతం ఉండగా కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. కశ్మీర్‌లో 'చిల్లయ్ కలన్' నడుస్తోంది. అంటే 40 రోజుల పాటు గడ్డకట్టే చలి లోయ ప్రజలను వణికిస్తుంది. భారీగా మంచు కురిసే సూచనలు ఉంటాయి. డిసెంబరు 21 నుంచి జనవరి 30 వరకు చిల్లయ్ కలన్ ఉంటుంది. ఆ తర్వాత 20 రోజులు చిల్లయ్ ఖుర్ద్, అనంతర పది రోజులు చిల్లయ్ బచ్చా ఉంటాయి. దేశ రాజధాని దిల్లీనీ శీతల ఉష్ణోగ్రతలు వణికిస్తున్నాయి. పొగమంచు కారణంగా రోడ్డు-రైల్ రవాణాకు అంతరాయం కలుగుతోంది. సోమవారం 3.8 డిగ్రీల ఉష్ణోగ్రతను సఫ్దార్‌జంగ్ అబ్జర్వేటరీ రికార్డు చేసింది. లోధీ రోడ్డు, పాలంలో 6.4 డిగ్రీలు, 7.5డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రత్తలు నమోదయ్యాయి. పొగమంచు కారణంగా దారి కనిపించక 39 రైళ్లు ఐదున్నర గంటలు ఆలశ్యంగా నడిచినట్లు నార్తరన్ రైల్వే అధికార ప్రతినిధి వెల్లడించారు. పంజాబ్, బీహార్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లలోనూ మంచు దుప్పటి కప్పేసి ఉండటాన్ని శాటిలైట్ దృశ్యాల్లో చూడవచ్చని వాతావరణ శాఖాధికారులు వెల్లడించారు.

## ఎల్జీ కార్యాలయం కేజ్రీవాల్‌కు అపాయింట్‌మెంట్ నిరాకరణ

**న్యూఢిల్లీ :** ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, ఆప్ మధ్య ఆధిపత్య పోరు నడుమ... సమావేశానికి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు 'సకాలంలో అపాయింట్‌మెంట్' ఇవ్వడానికి ఎల్జీ కార్యాలయం 'తిరస్కరించిందని' ప్రభుత్వ వర్గాలు మంగళవారం పేర్కొన్నాయి. ఢిల్లీ ప్రభుత్వ వర్గాలు చేసిన ఆరోపణపై ఎల్జీ కార్యాలయం నుంచి తక్షణ స్పందన లేదు. రెండు పక్షాల మధ్య విభేదాల నడుమ, పాలన సంబంధిత అంశాలపై చర్చించేందుకు సమావేశానికి ఆహ్వానిస్తూ కేజ్రీవాల్‌కు ఎల్జీ సోమవారం లేఖ రాశారు. కేజ్రీవాల్ సక్సేనాకు రాసిన లేఖలో ఆహ్వానాన్ని అంగీకరిస్తూ, 'మీ కార్యాలయంలో అనుకూలమైన సమయాన్ని నిర్ణయిస్తాను' అని తెలిపారు. 'పరిపాలన అధికారాలపై ఇప్పటికే ఉన్న వివాదంపై చర్చకు ఎల్జీ నిన్న ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. కానీ ఎల్జీ చాలా బిజీగా ఉన్నారని, శుక్రవారంలోపు సమావేశం కాలేరని చెప్పి ముఖ్యమంత్రికి సకాలంలో అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి ఎల్జీ కార్యాలయం నిరాకరించింది' అని ఆప్ వర్గాలు తెలిపాయి. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌కు ప్రిసైడింగ్ అధికారి, ఆల్డర్‌మెన్‌ల నియామకాలు, హజ్ కమిటీ సభ్యుల నియామకాలపై కేజ్రీవాల్ ఇంతకుముందు ఎల్జీని ప్రశ్నించారు.

## మాస్కో-గోవా విమానానికి బాంబు బెదిరింపు!

**జాంనగర్/పనాజీ:** బాంబు బెదిరింపు కారణంగా గుజరాత్‌లోని జామ్‌నగర్ విమానాశ్రయంలో అత్యవసరంగా దింపేసిన రష్యా అంతర్జాతీయ విమానంలో ఎటువంటి పేలుడు పదార్థాలు లభించలేదని అధికారులు వెల్లడించారు. అది ఉత్తుత్తి బెదిరింపు కాల్ మాత్రమేనని తేల్చారు. మంగళవారం దాని గమ్యస్థానమైన గోవాకు విమానం చేరుకుందని తెలిపారు. 'ఎన్ఎస్జీ టీమ్, పోలీసులు, బాంబు నిర్వీర్య బృందాలతో విమానాన్ని, ప్రయాణికులను, అందులో ఉన్న బ్యాగేజీని క్షుణ్ణం గా తనిఖీ చేశాము.

ఈ తనిఖీలు ఉదయం 9.50 గంటల వరకు కొనసాగించాం. అందులో అనుమానాదాస్పదంగా ఏం లభ్యం కాలేదు. అందులో ఉన్న ప్రయాణికులు ఇప్పుడు సురక్షితంగా ఉన్నారు' అని జామ్‌నగర్ కలెక్టర్ తెలిపారు. కాగా ప్రయాణికులు, సిబ్బందితో కూడిన విమానం మంగళవారం మధ్యాహ్నం 1.20 గంటలకు జామ్‌నగర్ విమానాశ్రయం నుంచి బయలుదేరింది. 15 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.39 గంటలకు గోవాలోని దబోలిమ్ విమానాశ్రయంలో దిగినట్లు ఎయిర్‌పోర్ట్ సీనియర్ అధికారి పీటీఐకి తెలిపారు. బాంబు బెదిరింపుతో 244 మంది ప్రయాణిస్తున్న మాస్కో-గోవా చార్టర్డ్ విమానాన్ని సోమవారం రాత్రి జామ్‌నగర్ విమానాశ్రయానికి మళ్లించారు. ప్రయాణికులు, సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చి విమానాశ్రయ లాంజ్‌లో ఉంచారు. తొలుత జామ్‌నగర్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందడంతో వెంటనే అప్రమత్తమైన అక్కడి జిల్లా కలెక్టర్‌తో పాటు మిగతా పోలీసు అధికారులు విమానాశ్రయానికి చేరుకున్నారు. వెంటనే విమానాన్ని అత్యవసరంగా దింపేసేలా ఆదేశాలు జారీచేశారు.

## ఒడిశాలో పెరుగుతున్న మగ్గర్ల సంఖ్య

**బెర్హంపూర్:** ఒడిశాలో మగ్గర్ల (భారతీయ మొసళ్లలో ఒక జాతి) జనాభా పెరుగుతుండటం వన్యప్రాణి ప్రేమికులను ఆనందపరుస్తోంది. గంజాం జిల్లా దిగపహండి ప్రాంతానికి సమీపంలోని ఘోడహడ నీటిపారుదల రిజర్వాయర్, దాని పక్కనే ఉన్న నీటి వనరులలో అంతరించిపోతున్న మొసలి జాతి అయిన మగ్గర్ల సంఖ్య పెరిగింది. గత నాలుగేళ్లలో 16 గా ఉన్న మగ్గర్ల సంఖ్య ఇప్పుడు 81కి పెరిగిందని అటవీశాఖ అధికారులు తెలిపారు. సుమారు ఐదు చదరపు కిలోమీటర్ల రిజర్వాయర్లలో 64 మగ్గర్లను కనుగొనగా, మరో 17 సమీపంలోని పది నీటి వనరులలో ఉన్నట్లు బెర్హంపూర్ డివిజనల్ అటవీ అధికారి అమ్లాన్ నాయక్ వెల్లడించారు. రాష్ట్రంలో కనిపించే మూడు మొసళ్ల జాతులలో మగ్గర్ ఒకటి. ఇతర మొసలి జాతులు ఘరియల్, ఉప్పు నీరు లేదా ఈస్ట్యూరైన్ మొసలి. దాదాపు 60 మంది అటవీ సిబ్బంది మగ్గర్ల రాత్రింబగళ్లు మగ్గర్ల గణనలో నిమగ్నమై ఉన్నారని ఆయన చెప్పారు. గతేడాది ఘోడహడ రిజర్వాయర్‌లో 76-58, సమీప చెరువుల్లో 18 మగ్గర్లు ఉన్నాయి. గత మూడు సంవత్సరాలలో నీటి వనరులలో మగ్గర్ల సంఖ్య పెరుగుదలకు స్థానిక ప్రజలు అందించిన రక్షణే ప్రధాన కారణమని నాయక్ తెలిపారు. మనుషులు, జంతువులు సహజీవనం చేసేలా అటవీశాఖ అధికారులు స్థానికులకు అవగాహన కల్పిస్తున్నట్లు మరో అధికారి తెలిపారు.

## 83వ పడిలో యేసుదాస్
### వెల్లువెత్తిన శుభాకాంక్షలు



**తిరువనంతపురం/కొచ్చి:** ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసుడు, సినీ నేపథ్యగాయకుడు కేజే యేసుదాస్ మంగళవారం 83వ ఏట అడుగుపెట్టారు. సామాజిక మాధ్యమాల్లో సినీ సూపర్‌స్టార్లు, గాయకులు, అభిమానులు, రాజకీయ నాయకుల నుంచి యేసుదాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. గాయకుడిగా ఆరు దశాబ్దాల ప్రస్థానంలో తన ప్రత్యేక స్వరంతో చిన్నా పెద్దా అందరినీ యేసుదాస్ అలరించారు. కర్ణాటకలోని ఉడిపి జిల్లా కొల్లూరులో మూకాంబిక ఆలయంలో అభిమానులు, సన్నిహితులు యేసుదాస్ పేరిట ప్రత్యేక పూజలు జరిపించారు. ఏసుదాస్ అకాడమీ కొచ్చిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, సిద్ధిక్, మనోజ్ కె.జయన్, ప్రముఖ నేపథ్య గాయకుడు ఎంజీ శ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న యేసుదాస్ ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొని తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సూపర్‌స్టార్ మోహన్‌లాల్ ఫేస్‌బుక్‌లో యేసుదాస్‌కి తన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. యేసుదాస్ కేరళకు గర్వకారణమని, కనీసం రోజుకు ఒక్కసారైనా ప్రపంచవ్యాప్తంగా ఆయన 'అమృత స్వరం' (దైవ స్వరం) వినని మలయాళీలు ఉండరని అన్నారు. 'నా ప్రియమైన దాశెట్టన్ (యేసుదాస్)కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు' అని తన ఫేస్‌బుక్ పేజీలో పేర్కొన్నారు. ప్రముఖ గాయని చిత్ర.. యేసుదాస్‌ను గాన గంధర్వుడిగా సంబోధిస్తూ ఫేస్‌బుక్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశంలోని దాదాపు అన్ని భాషలు, కళలు, సాహిత్యానికి సంబంధించి 80వేల పాటలు ఆలపించారన్నారు. గత మూడేళ్లుగా ఆయన భారత్‌కు తిరిగిరాలేదని, ఆయన్ను కలిసేందుకు ప్రతి ఒక్కరూ ఎదురుచూస్తున్నారన్నారు. 'మీరు గాయకులకు నిజమైన స్ఫూర్తి. మీ ఆరోగ్యం, క్షేమం కోసం నా ప్రార్ధనలు' అని తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్, ఏసుదాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ... ఆయన స్వరం ప్రతి మలయాళీ జీవితం, ఆనందం, ప్రేమ, వాంఛను ప్రతిబింబిస్తుందని అన్నారు. ప్రతి మలయాళీ కనీసం రోజుకు ఒక్కసారైనా ఆ స్వరాన్ని వింటారని తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో పేర్కొన్నారు. యేసుదాస్ 25,000 సినిమా పాటలు, కర్నాటక భజనలు, భక్తి పాటలను రికార్డ్ చేశారు. ఆరు దశాబ్దాల కాలంలో మలయాళం, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, బెంగాలీ, ఒడియా వంటి భారతీయ భాషలతో పాటు అరబిక్, ఇంగ్లీష్, లాటిన్, రష్యన్ భాషలలో కూడా తన స్వరంతో పాటలకు జీవం పోశారు. భారతప్రభుత్వం 2017లో యేసుదాస్‌కు పద్మవిభూషణ్ ప్రదానం చేసింది. మొత్తం ఎనిమిది జాతీయ అవార్డులు, 25 కేరళ రాష్ట్ర అవార్డులు, ఐదు తమిళనాడు రాష్ట్ర అవార్డులు, నాలుగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవార్డులు అందుకున్నారు. దేశంలోని గొప్ప నేపథ్య గాయకులలో ఒకరిగా పేరుగాంచిన యేసుదాస్ 1961 సంవత్సరంలో 'జాతి భేదం మాత ద్వేషం' అనే మలయాళ పాటతో టిన్సెల్ పట్టణంలో తన సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆయన హిందీలో ఆలపించిన "జబ్ దీప్ జలే ఆనా", "గోరీ తేరా గావ్ బడా ప్యారా" వంటి పాటలు ప్రజాదరణ పొందాయి.

# అంగన్‌వాడీల్లో నిరంతర పర్యవేక్షణ

- పిల్లల ఆరోగ్యాన్ని గ్రామీణ వైద్యకేంద్రాలు పరిశీలించాలి
- 63 సీడీపీఓ పోస్టుల భర్తీకి పచ్చజెండా
- మహిళా శిశు సంక్షేమశాఖపై సీఎం సమీక్ష

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** అంగన్‌వాడీలలో నిరంతర పర్యవేక్షణ ఉండాలనీ, పాలు, గుడ్లు లాంటి ఆహార పంపిణీలో ఎలాంటి సమస్యలు ఉండకూడదనీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. మహిళా శిశు సంక్షేమశాఖపై క్యాంపు కార్యాలయంలో సీఎం మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంగన్‌వాడీల సంక్షేమానికి దాదాపు రూ.1500 కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడాలన్నారు. పనుల్లో నాణ్యత ఉండాలని, చిన్నారులకు మంచి వాతావరణం అందించాలని ఆదేశించారు. ప్రతి మండలంలోనూ పనులు జరిగేలా మూడు విడతలకూ కార్యాచరణ రూపొందించాలన్నారు. వాటి పంపిణీపై సమగ్ర పర్యవేక్షణ, పరిశీలన ఉండాలని సూచించారు. ఎస్‌ఓపీలు రూపొందించుకోవాలని, టెక్నాలజీ వాడుకోవాలని చెప్పారు. పంపిణీలో ఎక్కడైనా లోపాలు ఉంటే కచ్చితంగా సంబంధిత వ్యక్తులను బాధ్యులు చేసి చర్యలు తీసుకోవాలనీ, సూపర్‌వైజర్లపైన కూడా పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.స్త్రీ శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీతో పాటు, పదోన్నతుల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. 63 సీడీపీఓ పోస్టుల భర్తీకి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వాటిని వీలైనంత త్వరగా భర్తీచేయాలని చెప్పారు. నూటికి నూరుశాతం పిల్లలకు పాలు పంపిణీ కావాలని, పిల్లలకు ఫ్లేవర్డ్ పాలు పంపిణీని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలన్నారు. మూడ్నెళ్ల తర్వాత పూర్తిస్థాయిలో ఫ్లేవర్డ్ మిల్క్ పంపిణీ కావాలని, ఈ మేరకు షెడ్యూల్ రూపొందించుకోవాలని సీఎం చెప్పారు. అంగన్‌వాడీలలో బోధనపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఉత్తమ బోధనలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ పద్ధతుల్లో బోధనపై ఆలోచన చేసి, ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులపై విలేజ్, వార్డు క్లినిక్స్ ద్వారా పరిశీలించాలన్నారు.వైద్యపరంగా ఎలాంటి చికిత్సలు అవసరమైనా ఆరోగ్యశ్రీని వినియోగించుకోవాలని, వారికి మెరుగైన వైద్యం అందించేలా చూడాలంట సీఎం ఆదేశించారు. తల్లిగానీ, బిడ్డగానీ ఎవరైనా రక్తహీనత, పౌష్టికాహారలోపం లాంటి సమస్యలతో బాధపడుతుంటే...వాటిని నివారించడానికి సమగ్రమైన కార్యాచరణ ఉండాలని చెప్పారు. ఈ విషయంలో అంగన్‌వాడీలు, విలేజ్ క్లినిక్‌లు, వైద్యఆరోగ్య శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇలాంటి సమస్యలు ఉన్నవారికి అందరితోపాటు ఇచ్చే ఆహారం, అందరితోపాటు ఇచ్చే మందులు కాకుండా...అదనంగా ఇస్తూ...వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలని, దీనిపై ఎస్‌ఓపీలను తయారు చేయాలని సీఎం ఆదేశించారు. ఫిబ్రవరి 1 నుంచి దీన్ని అమలు చేయాలని, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో దీనికి పరిష్కారం చూపించాలన్నారు. తల్లులకు టేక్ హోం రేషన్ విధానంపై ఆలోచించాలని, దీనికోసం లోపాలకు తావులేని విధానాన్ని రూపొందించాలని సీఎం సూచించారు. అంగన్‌వాడీలలోను, ప్రభుత్వ బడులలో బలహీనవర్గాలకు చెందిన పిల్లలే అధికంగా ఉంటారనీ, ఆయా వర్గాలకు చెందిన పిల్లలకు తోడుగా నిలబడాల్సిన అవసరముందని, వారి పట్ల సానుకూల దృక్పథంతో పనిచేయాలని సీఎం చెప్పారు. 10–12ఏళ్ల వయస్సులో మంచి బోధన అందించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యా, వ్యవసాయం, వైద్యారోగ్యం తరహాలో మహిళ, శిశు సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం ప్రాధాన్య కార్యక్రమంగా చేపట్టిందని వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ బాబు, పాఠశాల మౌలికవసతులశాఖ కమిషనర్ కాటమనేని భాస్కర్, పౌరసరఫరాలశాఖ ఎండీ జి.వీరపాండ్యన్, మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ ఏ.సిరి, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్‌పాండే, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వరంగ బ్యాంకుల్లో వివక్ష

- ఉన్నత పదవుల్లో 13 మందే మహిళలు
- ఏళ్లు గడుస్తున్నా భర్తీకానీ డైరెక్టర్ పోస్టులు
- నేటికీ 34 శాతం ఖాళీలు

**న్యూదిల్లీ:** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మహిళా ప్రాతినిధ్యం అంతంత మాత్రంగానే ఉంది. 12 పీఎస్బీల్లోని ఉన్నత పదవుల్లో 13 మంది మహిళలు మాత్రమే ఉన్నారు. దీంతో ఆ వ్యవస్థలో లింగ అసమానత్వం స్పష్టమవుతోందని ఒక అధ్యయనం పేర్కొంది. 122 మంది డైరెక్టర్లు ఉంటే వారిలో 10.22శాతంగా మహిళలు ఉన్నారని, దాదాపు మూడో వంతుకుపైగా పోస్టులు నేటికీ ఖాళీగా ఉన్నాయన్నది. 12 బ్యాంకుల్లో ఆఫీసర్ ఎంప్లాయీగానీ వర్క్‌మెన్ ఎంప్లాయీ డైరెక్టర్లుగానీ లేరని తెలిపింది. ఈ రెండు విభాగాల్లో నాలుగు ఖాళీలు యూపీఏ నాటివి కాగా మిగతా 20 పోస్టులు మోదీ హయాంలోనివి అని పారదర్శకత (ట్రాన్స్‌పరెన్సీ) కార్యకర్త వెంకటేశ్ నాయక్ అధ్యయనం చెబుతోంది. ఆర్థికసేవల వ్యవస్థల బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) వెబ్‌సైట్‌లోని సమాచారం ఆధారంగా నాయక్ ఈ మేరకు విశ్లేషించారు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూసీఓ బ్యాంకులో మహిళా బోర్డు డైరెక్టర్లు లేరు. కెనరా బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, పంజాబ్&సింధ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఇద్దరు చొప్పున ఉన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌లో ఒక్కొక్కరు చొప్పున మహిళా డైరెక్టర్లున్నారు. అన్ని బ్యాంకుల్లో కలిపి మొత్తం 186 డైరెక్టర్ పోస్టులు ఉంటే వాటిలో 122 మాత్రమే భర్తీ అయ్యాయి. మిగతా 64 అంటే 34శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 122మంది డైరెక్టర్లలో 109మంది పురుషులు ఉన్నారు. 2021 సెప్టెంబరులో 91 ఖాళీలు అంటే 50శాతం డైరెక్టర్ పోస్టులు భర్తీ కాలేదు. ప్రస్తుతం 34శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2009 సెప్టెంబరు నుంచి పంజాబ్ సింధ్ బ్యాంకులో డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఈ ఏడాది జనవరిలో కెనరా బ్యాంకులో ఖాళీ ఏర్పడింది. మిగతావి 2014-22 మధ్యకాలంలోనివని అధ్యయనం పేర్కొంది.

## విశ్వాస ఓటు గెల్చుకున్న ప్రచండ

**ఖాట్మండు:** నేపాల్ నూతన ప్రధాని పుష్ప కమల్ దహల్ 'ప్రచండ' మంగళవారం ప్రతినిధుల సభలో విశ్వాస ఓటును గెలుచుకున్నారు. మొత్తం 270 సభ్యులున్న సభలో ప్రచండకు 268 ఓట్లు వచ్చాయి. ఇద్దరు మాత్రమే వ్యతిరేకంగా ఓటేశారు. సభకు అధ్యక్షత వహించిన సీనియర్ నేత పశుపతి షంషేర్ జేబీ రాణా విశ్వాస ఓటింగ్‌లో ప్రచండ నెగ్గినట్లు ప్రకటించారు. అధ్యక్ష బాధ్యతల్లో ఉన్నంతన ఆయన ఓటింగ్‌లో పాల్గొనలేదు. మరో నలుగురు సభ్యులు గైర్హాజరయ్యారు. తన బలాన్ని రుజువు చేసేందుకు ప్రచండకు 138 ఓట్లు కావాల్సి ఉండగా ఆయన క్లీన్‌స్వీప్ చేశారు. ప్రచండ డిసెంబరు 26న నేపాల్ ప్రధానిగా మూడవసారి ఎన్నికయ్యారు.

## స్వర్ణాలయంలో రాహుల్ ప్రత్యేక పూజలు

**చండీగఢ్/అమృత్‌సర్:** కాంగ్రెస్ చేపట్టిన భారత్ జోడో యాత్ర నిరాటం కంగా సాగుతూ బుధవారం పంజాబ్‌లోకి ప్రవేశిం చనున్నది. దీంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం అమృత్‌సర్ చేరుకొని ఆక్కడి స్వర్ణాల యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తలపాగా కట్టి సర్ణాలయంలో సంప్రదాయబద్ధంగా ప్రార్థనలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పంజాబ్ రాష్ట్ర నేతలు అమరిందర్ సింగ్ రాజా వర్రింగ్, ప్రతాప్ సింగ్ బాజ్వా, గుర్జిత్ సింగ్ అజ్లా తదితరులు ఉన్నారు. అంతముందు హరియాణాలోని అంబాలా జిల్లాలో యాత్ర ముగింపు నేపథ్యంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ స్వర్ణాలయాన్ని సందర్శిస్తారని చెప్పారు. ఉదయం అంబాలా కంటోన్మెంట్‌లోని షాపూర్ నుంచి పాద యాత్ర ప్రారంభం కాగా కాంగ్రెస్ నేత రాజ్ బబ్బర్ పాల్గొన్నారు. హరియాణాలో ఎనిమిది రోజుల్లో ఏడు జిల్లాల గుండా 255 కిమీలు యాత్ర సాగిందని జైరాం రమేశ్ తెలిపారు. రాత్రికి పంజాబ్‌లోని సిర్హిండ్‌లో బస చేసి బుధవారం ఉదయం ఆ రాష్ట్రంలో యాత్రను ప్రారంభిస్తామని అన్నారు. మండీ గోవింద్‌ఘర్ గుండా యాత్ర సాగుతుందని రాత్రికి ఖన్నాలో బస చేస్తామని చెప్పారు. రెండు దశల్లో 25కిమీలు చొప్పున ప్రతి రోజూ పాదయాత్ర సాగుతుందిగానీ 12వ తేదీన ఒకటే దశ ఉంటుందని, 13న లోహ్రీ (భోగి) సందర్భంగా యాత్రకు విరామమని జైరాం రమేశ్ తెలిపారు. హరియాణాలో కాంగ్రెస్ నేతలు భూపిందర్ సింగ్ హుడా, కుమారీ సెల్జా, రణదీప్ సుర్జేవాలా, దీపేంద్ర సింగ్ హుడా, కేసీ వేణుగోపాల్ తదితరులు యాత్రలో పాల్గొన్నారు. స్థానికులు పెద్దసంఖ్యలో రాహుల్‌తో కలిసి కదంతొక్కారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ దీపక్ కపూర్ పాల్గొనడంపై బీజేపీ చేసిన విమర్శలను జైరాం రమేశ్ తిప్పికొట్టారు. ఎన్నికల లబ్ధి కోసం సమాజాన్ని విభజించే సిద్ధాంతాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని, వైవిధ్యతను పరిరక్షించడం తమ ప్రాథమిక కర్తవ్యమని ఆయనన్నారు. ఐక్యతా సందేశాన్నే భారత్ జోడో యాత్ర ఇస్తోందని జైరాం రమేశ్ నొక్కిచెప్పారు.

## బెంగళూరులో కూలిన మెట్రో పిల్లర్

### తల్లీకుమారుడు దుర్మరణం

**బెంగళూరు:** బెంగళూరులో 'నమ్మ మెట్రో' (బెంగళూరు మెట్రో) పిల్లర్ కూలి ఓ మహిళ, ఆమె రెండున్నరేళ్ల కుమారుడు మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం ఉదయం 11 గంటలకు నగరంలోని హెచ్‌బీఆర్ లేవుట్ వద్ద అవుట్ రింగ్ రోడ్‌పై జరిగింది. పిల్లర్ల నిర్మాణానికి ఏర్పాటు చేసిన టీఎంటీ కడ్డీలు వారి స్కూటర్‌పై పడింది. దీంతో భార్యభర్త వారి ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. తల్లీకుమారుడు ప్రాణాలు కోల్పోగా, ఆమె భర్త, మరో బిడ్డ కోలుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. 'పిల్లర్ ఎత్తు 40 అడుగులు కాగా బరువు టన్నుల్లో ఉంటుంది. తల్లీకుమారుడిని వెంటనే ఆసుపత్రికి తరలించినా ఫలితం దక్కలేదు. తీవ్ర రక్తస్రావంతో బీపీ పడిపోయిందని, ప్రాణాలు కాపాడలేకపోయామని వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశాం' అని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ధర్వాడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'ఇప్పుడే విషయం తెలిసింది. దర్యాప్తు చేపడతాం.. పిల్లర్ ఎలా కూలిందో ఆరా తీస్తాం. బాధితులకు పరిహారమిస్తాం' అని అన్నారు.

## గూఢచారి-2 ఫస్ట్‌లుక్ విడుదల

**హైదరాబాద్:** చిన్న చిన్న పాత్రలతో నటుడిగా తన ప్రయాణాన్ని మొదలెట్టిన అడివి శేష్, ఎప్పటికప్పుడు కొత్తదనం కోసం శ్రమిస్తూ హీరోగా ఎదిగాడు. తనకంటూ ఒక జోనర్‌ను సెట్ చేసుకున్నాడు. 2018లో ఆయన చేసిన 'గూఢచారి' పెద్ద హిట్. అప్పటి నుంచి ఆ సినిమా సీక్వెల్ మాటలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా ఆ సినిమా సీక్వెల్ కి సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ సినిమాకి 'గూఢచారి 2' అనే టైటిల్ ను ఖాయం చేశారు. అనిల్ సుంకర ... అభిషేక్ అగర్వాల్ ... వివేక్ కూచిభొట్ల ... విశ్వప్రసాద్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా నుంచి ఫస్టులుక్ ను విడుదల చేశారు. ఈ సినిమా 'ప్రీ విజన్ ఈవెంట్' లో అడివి శేష్ మాట్లాడుతూ .. "ప్రపంచవ్యాప్తంగా ఈ ఫ్రాంచైజీని తీసుకుని వెళ్లాలనే ఒక తపన ఉంది. వినయ్ అనే కొత్త దర్శకుడితో ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది. తనకి మంచి విజన్ ఉంది. స్పై యాక్షన్ తరహా సినిమాల్లో ఇది నెక్స్ట్ లెవెల్లో ఉంటుందని చెప్పగలను" అన్నాడు. 'గూఢచారి' పార్టు 1 సౌత్ సినిమాల్లో స్పై ఫిలిమ్స్ ట్రెండ్ ను మళ్లీ తిరిగి తీసుకుని వచ్చింది. ఇక 'గూఢచారి 2' అనేది ఆల్ ఇండియా ఫ్రాంచైజ్ గా మారబోతోందని నేను గర్వంగా చెప్పగలను. నేను సిక్స్ ప్యాక్ చేసిన తరువాతనే షూటింగుకి వెళ్లడం జరుగుతుంది. శ్రీచరణ్ పాకాల ఈ సినిమాకి సంగీతాన్ని అందించనున్నాడు. ఐదు దేశాల్లో ఈ సినిమా షూటింగును ప్లాన్ చేయడం జరిగింది. 2024లో ఈ సినిమా థియేటర్లకు వస్తుంది" అని చెప్పారు.

## పఠాన్‌పై ప్రేక్షకుల ఆసక్తి

**ముంబై:** బాలీవుడ్ సూపర్‌స్టార్ ఎస్ఆర్‌కె నటించిన పఠాన్ 2023లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారతీయ చిత్రంగా నిలిచిందని ఐఎండీబీ తెలిపింది. ఐఎండీబీ పేజీ నెలవారీ సందర్శకులు 2 కోట్ల మంది పేజీ వీక్షణల ఆధారంగా ఈ విషయాన్ని తెలిపింది. చలనచిత్రాలు, టీవీ కార్యక్రమాలు, సెలబ్రిటీల గురించిన సమాచారం కోసం ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన, అధికారిక మూలం ఐఎండీబీ. 2022 అంతటా వినియోగదారుల వాస్తవ పేజీ వీక్షణల ఆధారంగా అత్యధికంగా ఎదురుచూస్తున్న భారతీయ చిత్రాల జాబితాను ఐఎండీబి నిర్ణయిస్తుంది. ఈ ఏడాది అత్యధికంగా ఎదురుచూస్తున్న భారతీయ చలనచిత్రాలు పఠాన్, పుష్ప: ది రూల్ – పార్ట్ 2, జవాన్, ఆదిపురుష్, సాలార్, వరిసు, కబ్జా, తలపతి 67, ది ఆర్చీస్, డంకి, టైగర్ 3, కిసీ కా భాయ్ కిసీ కి జాన్, తునివు, యానిమల్, ఏజెంట్, ఇండియన్ 2 వాడివాసల్, షెహజాదా, బడే మియా చోటే మియా, భోలా ఉన్నాయి.

## సంక్రాంతికి 'కల్యాణం...కమనీయం'

**హైదరాబాద్:** అనిల్ కుమార్ దర్శకత్వంలో సంతోష్ శోభన్ కథానాయకుడిగా, ప్రియా భవాని శంకర్ కథానాయికగా యూవీ కాన్సెప్ట్ నిర్మించిన 'కల్యాణం కమనీయం' సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14వ తేదీన విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ సినిమా నుంచి ప్రభాస్ చేతుల మీదుగా ఒక పాటను రిలీజ్ చేయించారు. 'సింగిల్ లైఫ్ అంటే సింపుల్ అంటారు .. బాబూ చెయ్యొద్దా తప్పు' అంటూ ఈ పాట మొదలవుతోంది. 'కల్యాణం కమనీయం కద బాసూ .. అరె సోలోగున్నావంటే ఉండదు జోషు' అంటూ నడుస్తుంది. శ్రీచరణ్ పాకాల సంగీతాన్ని అందించిన ఈ పాటకి కృష్ణకాంత్ సాహిత్యాన్ని అందించారు. ఈ పాటకి యశ్ నృత్యరీతులు సమకూర్చారు.

# తొలి వన్డేలో లంక చిత్తు

## 67 పరుగులతో టీమిండియా ఘన విజయం

**గుహవతి:** శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇక్కడి బరస్పర క్రికెట్ స్టేడియంలో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించింది. 67 పరుగుల తేడాతో లంకను చిత్తుచేసింది. సిరీస్‌లో 1–0 ఆధిక్యంతో నిలిచింది. 374 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 306 పరుగులు మాత్రమే చేయగలిగింది. తొలుత టాస్ గెలిచిన శ్రీలంక ఫీల్డింగ్ ఎంచుకోగా బ్యాటింగ్ ప్రారంభించిన టీమిండియా భారీ స్కోరు సాధించింది. విరాట్ కోహ్లి కళాత్మక షాట్లతో 45వ వన్డే సెంచరీకి తోడు రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ అర్ధసెంచరీలతో రాణించారు. ఓపెనర్లు రోహిత్, గిల్ మొదటి వికెట్‌కు 143 పరుగులు జోడించారు. శ్రేయాస్ అయ్యర్ (28), కేఎల్ రాహుల్ (39)లతో కలిసి కోహ్లి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. మునపటి కోహ్లిని గుర్తు చేస్తూ తనదైన షాట్లతో లంక బౌలర్లను చెండాడాడు. 80 బంతుల్లోనే సెంచరీ బాదాడు. ధాటిగా ఆడే క్రమంలో హార్దిక్ పాండ్యా (14), అక్షర్ పటేల్ (9)త్వరగా వెనుదిరిగారు. దీంతో నిర్ణీత 50 ఓవర్లలో భారతజట్టు 7వికెట్లు కోల్పోయి 373 పరుగులు చేసింది.

లంక బౌలర్లలో రజిత మూడు వికెట్లు పడగొట్టాడు. మధుషనక, దసున్ షనక తలా ఒక వికెట్ తీశారు. కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శ్రీలంక వరుసగా వికెట్లు కోల్పోయింది. చివర్లో కెప్టెన్ దసున్ షనక తుఫాన్ ఇన్నింగ్స్ ఆడి సెంచరీ (108) బాదాడు. నిర్ణీత ఓవరల్లో శ్రీలంక 8 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. షనక ఇచ్చిన రెండు క్యాచ్‌లు రోహిత్ శర్మ, కోహ్లి క్యాచ్‌లు జారవిడిచారు. దాంతో లంక 300 పరుగులు చేయగలిగింది. లంక టాపార్డర్‌లో ఓపెనర్ ప్రథుమ్ నిస్సంకా (72), ధనంజయ డిసిల్వా(47), చరిత అసలంక (23) రాణించారు. భారత బౌలర్లు వరుసగా వికెట్లు తీస్తూ లంకను ఒత్తిడిలోకి నెట్టారు. ఆవిష్క ఫెర్నాండో(5), కుశాల్ మెండిస్(0)లను అవుట్ చేసి సిరాజ్ లంకను దెబ్బతీశాడు. భారత బౌలర్లలో ఉమ్రాన్ మాలిక్ మూడు, సిరాజ్ రెండు వికెట్లు పడగొట్టారు. చాహల్, షమి, హార్దిక్ పాండ్యాకు ఒక్కో వికెట్ దక్కింది.

## సచిన్ రికార్డును సమం చేసిన కోహ్లి

**గుహవతి:** వన్డే ప్రపంచకప్ జరిగే కొత్త ఏడాదిని విరాట్ కోహ్లి అద్భుతంగా ప్రారంభించాడు. శ్రీలంకతో జరిగిన తొలి వన్డేలో క్లాస్ ఇన్నింగ్స్‌తో శతకం బాదిన విరాట్ కోహ్లి... స్వదేశంలో 20 సెంచరీలు సాధించి సచిన్ సరసన నిలిచాడు. అయితే సచిన్ తన 49 వన్డే సెంచరీల్లో స్వదేశంలో సాధించిన 20 సెంచరీలను 164 వన్డేల్లో కొట్టగా, కోహ్లి కేవలం 102 వన్డేల్లోనే 20 సెంచరీలను సాధించడం విశేషం. కాగా శ్రీలంకపై అత్యధికంగా సెంచరీలు సాధించిన బ్యాటర్‌గా విరాట్ రికార్డు సృష్టించాడు. ఇంతకుముందు ఎనిమిదేసి శతకాలతో సచిన్, కోహ్లి సమంగా ఉండేవారు. ఇప్పుడు 9వ సెంచరీని కోహ్లి తన ఖాతాలో వేసుకొన్నాడు. అలాగే ఆస్ట్రేలియా, శ్రీలంక జట్లపై తొమ్మిది సెంచరీలు సాధించిన బ్యాటర్‌గా అవతరించాడు.

అన్ని ఫార్మాట్లలో కలిపి విరాట్ శతకాల సంఖ్య 73కి చేరింది. ఇందులో 27 టెస్టు సెంచరీలు కాగా.. మరో 45 వన్డే శతకాలు ఉన్నాయి. గతేడాది ఆసియా కప్‌లో తొలిసారి టీ20ల్లోనూ సెంచరీ నమోదు చేశాడు. దీంతో సచిన్ (100) తర్వాత విరాట్ (73) అత్యధిక శతకాలతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం వన్డేల్లో విరాట్ కోహ్లి 12,584 పరుగులతో ఆరో స్థానంలో ఉన్నాడు. అతడికి కాస్త దూరంలో జయవర్దనే (12,650) ఉన్నాడు. ఇక ఈ జాబితాలో సచిన్ 18,426 పరుగులతో అగ్రస్థానంలో ఉండటం విశేషం.

## తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన సైనా నెహ్వాల్, శ్రీకాంత్

**కౌలాలంపూర్:** కొత్త ఏడాదిలో తొలి టోర్నమెంట్‌ను విజయంతో ప్రారంభించాలి అనుకున్న భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్‌కు షాక్ తగిలింది. మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ తొలి రౌండ్‌లోనే ఆమె పోరాటం ముగిసింది. మాజీ వరల్డ్ నంబర్ 1 సైనా, చైనాకు చెందిన పదకొండో ర్యాంకర్ హన్ యుయీ చేతిలో ఓడిపోయింది. మూడు సెట్లలో 12-21, 21-17, 12-21తో సైనా పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ కూడా ఇంటిదారి పట్టాడు. 13వ ర్యాంకర్ అయిన ఇతను తనకంటే తక్కువ ర్యాంక్‌లో ఉన్న జపాన్ ఆటగాడు కెంటా నిషిమొటో చేతిలో ఓటమి చవిచూశాడు. 17 ర్యాంక్‌లో ఉన్న నిషిమొటో వరుస సెట్లలో 21-19, 21-14తో శ్రీకాంత్‌పై గెలుపొందాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.